తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త

ఆదివారం

8 ఫిబ్రవరి, 2026












# డిజిటల్ ఉచ్చు..
# బతుకులో చిచ్చు!

# వెండి జిలుగులు !



గణతంత్రదినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వం 2026 సం. పద్మ పురస్కారాలను ప్రకటించింది. ఐదుగురిని పద్మ విభూషణ్, 13 మందిని పద్మ భూషణ్, కళలు ముఖ్యంగా సినీ రంగంలో విశేషకృషి చేసిన పలువురు పద్మ పురస్కారాలకు ఎంపిక అయ్యారు. అందులో దిగ్గజ నటుడు ధర్మేంద్రకు భారతీయ అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన పద్మ విభూషణ్ (మరణానంతరం) కేంద్రం ప్రకటించింది.

మలయాళ హీరో మమ్ముట్టికి మలయాళ సినీ రంగానికి ఆయన చేసిన సేవను గుర్తించిన ప్రభుత్వం పద్మభూషణ్ ప్రకటించింది.



పద్మశ్రీ లేట్‌గా వచ్చినా లేటెస్ట్‌గా వచ్చింది: మురళీ మోహన్ చలనచిత్ర పరిశ్రమ ప్రముఖులందరికీ కృతజ్ఞతలు.





కేవలం నటన మాత్రమే కాదు. ప్రజల్లో విద్య, ఆరోగ్య విషయాల్లో అవగాహన కల్పించడానికి మమ్ముట్టి తన వంతు కృషి చేస్తున్నందుకు గానూ ఈ పురస్కారం దక్కింది. అలాగే మన తెలుగు నటకిరీటి రాజేంద్రప్రసాద్‌కి కూడా పద్మ కిరీటం వరించింది. అదేవిధంగా సీనియర్ నటుడు మురళీ మోహన్ కథానాయకుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా ఆరు దశాబ్దాలుగా తనదైన నటనతో అలరించారు. ఆయనకు కూడా పద్మం వరించింది. వీరితోపాటు దక్షణాది నటుడు చాక్లెట్ బాయ్‌గా పేరుకెక్కిన మాధవన్‌కు, అలనాటి గాయని అల్కాయాగ్నిక్‌కి ఈ పురస్కారాలు వరించాయి.



'పద్మశ్రీ' పురస్కారం రావడం నా పూర్వజన్మ సుకృతం రాజేంద్ర ప్రసాద్ ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు నా హృదయ పూర్వక ధన్యవాదాలు.



## విధిరాతను దాటి వెలుగు చూస్తున్న చిత్రం !



మూడు దశాబ్దాల క్రితం చిత్రీకరణ జరుపుకుని ఆగి పోయిన ఓ భారీ మల్టీస్టారర్ చిత్రం ఇప్పుడు థియేటర్లలోకి వచ్చేందుకు సిద్ధమైంది. రజనీకాంత్, శత్రుఘ్న సిన్హా, హేమమాలిని, అమ్రేష్ పురి, జగదీప్ వంటి దిగ్గజ నటులు కలిసి నటించిన 'హమ్ మే షాహెన్‌షా కౌన్' అనే హిందీ చిత్రం ఎట్టకేలకు విడుదలకు నోచుకుంది. ఆధునిక సాంకేతికతతో పునరుద్ధరించి ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు. రాజారాయ్ నిర్మించిన ఈ చిత్రానికి హర్మేష్ మల్హోత్రా దర్శకత్వం వహించారు. సలీంఫైజ్ సంభాషణలు, లక్ష్మీకాంత్ ప్యారేలాల్ సంగీతం, ఆనంద్ బక్షి సాహిత్యం, సరోజ్ ఖాన్ కొరియోగ్రఫీ అందించారు. 35 ఎంఎం ఈస్ట్‌మన్ కలర్‌పై చిత్రీకరించినప్పటికీ, అప్పట్లో ఈ సినిమా



సెన్సార్‌కు వెళ్లకపోవడంతో విడుదల ఆగిపోయింది. ఈ ఆలస్యానికి ప్రధాన కారణం నిర్మాత రాజా రాయ్ జీవితంలో ఎదురైన ఓ పెను విషాదం. ఆ తర్వాత కొన్నేళ్లకు దర్శకుడు హర్మేష్ మల్హోత్రా కూడా కన్నుమూయడంతో ప్రాజెక్ట్ పూర్తిగా నిలిచి పోయింది. అయితే, ఆధునిక టెక్నాలజీ సహాయంతో ఈ సినిమాకు పునరుజ్జీవం పోశారు. ఏఐ టెక్నాలజీతో విజువల్స్, ఆడియో నాణ్యతను మెరుగు పరిచామని, 4కె రిజల్యూషన్‌తో పాటు 5.1 సరౌండ్ సౌండ్‌తో సినిమాను సిద్ధం చేశామని అసోసియేట్ ప్రొడ్యూసర్ అస్లాం మీర్జా తెలిపారు. సినిమా అసలు కథ, నటన వంటి ఆత్మను ఏమాత్రం మార్చలేదని ఆయన స్పష్టం చేశారు. ఎన్నో విషాదాలను, అడ్డంకులను దాటుకుని ఈ సినిమా విడుదల కావడం విధిరాతగా భావిస్తున్నాను అని నిర్మాత రాజారాయ్ ఆనందం వ్యక్తం చేశారు. ఇప్పుడు కొత్త హంగులతో ప్రేక్షకులను అలరించనుంది.

ఆదివారం వార్త

8 ఫిబ్రవరి, 2026

## మంచి ముత్యాలు

– మారడం ఎంత కష్టమో అనుభవపూర్వకంగా తెలుసుకుంటే, ఇతరుల్ని మార్చడంలో నీవెంత సఫలం సాధించగలవో నీకు సులువుగా అర్థం అవుతుంది. – ఆర్నాల్డ్ హెచ్.గ్లాసో

## కదంబం

'సంఘీ'భావం....5
చిన్న వయసులోనే గుండెపోటు

కవర్ స్టోరీ..6
డిజిటల్ ఉచ్చు.. బతుకులో చిచ్చు!

ఈ వారం కవిత్వం.. 11
ఆంతరంగిక సంపద

కథ..20
రెండో ఇన్నింగ్స్

అంతర్జాతీయ ఖ్యాతి గడించిన.. 24

ఇంకా...

మొగ్గ
పుస్తక సమీక్ష
వాస్తు
వారఫలం
వగైరా.. వగైరా..

# సమాచారం

## ఆ గ్రామస్తులను తాకకూడదు..

హిమాచల్‌ప్రదేశ్‌లోని ఒక పురాతన గ్రామం 'మలానా'. ఈ ఊరు సముద్ర మట్టానికి సుమారు తొమ్మిది వేల అడుగుల ఎత్తులో ఉంది. ఈ నగ్రామానికి స్వంత జీవనశైలి, సామాజిక నిర్మాణం ఉంది. స్థానికులు ఇక్కడ ఆచార వ్యవహారాలను తూచా తప్పకుండా పాటిస్తారు. ఈ గ్రామ ఆచారం ప్రకారం బయటి వ్యక్తులు, గ్రామంలోనివారు దేవాలయాలతో సహా దేనినీ భౌతికంగా తాకరాదు. ఈ నియమం ఉల్లంఘిస్తే జరిమానా విధిస్తారు. ఎవరైనా బయటి వ్యక్తులు ఈ గ్రామస్తులను తాకితే వారు తర్వాత స్నానం చేస్తారట. గ్రామస్తులకు వారి దేవత పట్ల ఉన్న నమ్మకం, వారి పురాతన జీవన విధానాన్ని కాపాడుకోవాలనే కోరిక, బాహ్య ప్రభావాల నుండి వారి సాంస్కృతిక గుర్తింపును రక్షించుకోవాలనే నిబద్ధత తెలియచేస్తోంది. మలానా జల విద్యుత్ కేంద్రం అనే ఆనకట్ట ప్రాజెక్టు మలానాను ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలకు చాలా దగ్గరగా తీసుకువచ్చింది. స్థానిక ఇతిహాసాల ప్రకారం జామ్లు ఋషి ఈ ప్రాంతంలో ఉండి, నియమాలు, నిబంధనలు రూపొందిచాడు. ప్రపంచంలోని పురాతన ప్రజాస్వామ్యాలలో ఒకటి అనీ, వారి దేవత జామ్లు ఋషిచే నడిపించబడిన వ్యవస్థీకృత పార్లమెంటరీ వ్యవస్థతో ఉందని విశ్వసిస్తారు. మలానాలో పర్యాటం అభివృద్ధి చెందుతున్నప్పటికీ గ్రామస్తులు తమ ఆచారాలను కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నారు. బయటి వ్యక్తులు గ్రామాన్ని సందర్శించాలంటే వారి నియమాలను తప్పనిసరిగా పాటించాలి.



మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు.
sunmagvaartha@gmail.com

## ఎన్నికలొస్తున్నాయిగా!

"ఈ మధ్య బాగా బిజీగా ఉంటున్నారు, ఏంటి విశేషం?" అన్నాడు, రవి పళ్ల డాక్టర్‌తో.

"త్వరలో ఎన్నికలు వస్తున్నాయిగా. నాయకులంతా హాస్పిటల్‌కు క్యూ కట్టారు, ఓట్ల కోసం వెళ్లినప్పుడు నవ్వుతూ పలకరించాలిగా!" అన్నాడు పళ్ల డాక్టర్.



## వచ్చే జన్మలో..

"ఏమండీ, ఈ జన్మలో అయినా బార్‌కి వెళ్లడం మానేస్తారా?" అంది భార్య, భర్తతో.

"వచ్చే జన్మలో ఆపుతాను" అన్నాడు.

"అదెలా వీలువుతుంది?" అంది భార్య.

"వచ్చే జన్మలో నీకు మళ్లీ భార్యగా పుడతానుగా!"

## చూడడానికి..

"ఏరా, ఈ మధ్య మాజీ నాయకులతో ఇంటింటికి తిరుగుతున్నావు. ఏంటి సంగతి?" అన్నాడు, దొంగతో, మరో దొంగ.

"ఏ ఇంట్లో దొంగతనం చేయవచ్చోనని చూడడానికి వెళ్తున్నాను" బదులిచ్చాడు మొదటి దొంగ.

## రికార్డ్స్ లో లేను

"డాక్టర్, డాక్టర్.. నేను చనిపోయానట" అన్నాడు రవి కంగారుగా డాక్టర్‌తో.

"మరి నువ్వు నా ఎదురుగా నిలబడ్డావు, అయితే నువ్వెవరు?"

"రేషన్ కార్డులో నేను చనిపోయినట్లు వచ్చింది డాక్టర్" సమాధానమిచ్చాడు, రవి.

## డూప్లికేట్

"ఏమండీ, రేపు నా పుట్టినరోజు కదా! నా బర్త్‌డే గిఫ్ట్‌గా ఏం ఇవ్వబోతున్నారు?" అంది విజ్జి భర్తతో.

"బంగారం చైన్ కొంటున్నాను" అన్నాడు, భర్త.

"బంగారం ధర భారీగా క్షణక్షణానికి పెరుగుతోంది కదండీ, ఎలక్ట్రిక్ స్కూటర్ కొనండి చాలు" అంది. "డూప్లికేట్ స్కూటర్ దొరుకుతుందా మరి?" తెలివిగా బదులిచ్చాడు భర్త.

## సెలవిస్తారు

టీచర్: "అంజలీ, భూమి ఉపరితలం మీద నీరు ఆవిరి రూపంలో అంతరిక్షంలోకి వెళ్లి మేఘం రూపంలో మారితే ఏమవుతుంది?"

అంజలి: "మన స్కూలుకి సెలవు ఇస్తారు టీచర్" అంది, అంజలి.

## సీక్రెట్

"మాధవీ, నీ లవర్‌ని ఎప్పుడూ నీ వెనకాలే తిప్పుకుంటున్నావు. ఏం మాయ చేసావు?" అడిగింది స్నేహితురాల్ని.

"వాడి కారు తాళాలు నా దగ్గరే ఉంచుకున్నాను, అదీ నా సీక్రెట్" అంది మాధవి.

# నవ్వుల్... రువ్వుల్...

## పాసవలేదుగా!

టింకు: "డాడీ, నీకో గుడ్ న్యూస్. నేను ఒక్క సబ్జెక్టులోనయినా పాస్ అయితే వెయ్యి రూపాయలు ఇస్తానన్నావుగా!"

"రిజల్ట్స్ వచ్చాయా? మరి.. ఎన్ని సబ్జెక్టుల్లో పాస్ అయ్యావు?"

"అదేగా నేను చెప్పబోయేది..నీ వెయ్యి రూపాయలు నీ దగ్గరే ఉన్నాయి"

"అంటే?"

"ఒక్కదాంట్లోనూ నేను పాస్ కాలేదుగా!"

## మీ భార్యని..

"ఏమండీ, మీకు పెళ్లి అయిందా?" అడిగింది ఫోన్ చేసి, ఓ అమ్మాయి గొంతుతో రామారావుని.

"ఇంకా కాలేదండీ!"

"ఏంటి మీకు పెళ్లి కాలేదా? ఇంటికి రండి చెప్తాను మీ పని, నేను మీ భార్యను మాట్లాడుతున్నాను" అంది భార్యామణి.

## బులెట్



బులెట్‌పై వెళ్తూ లవర్‌తో మాట్లాడాలని బులెట్ కొన్నాడు ఓ ప్రేమికుడు. కానీ మాటలు సరిగ్గా వినపడలేదు.

ఇది బాగాలేదని ఎలక్ట్రిక్ స్కూటర్ కొన్నాడు. దాంతో అతి త్వరలో ఇద్దరూ భార్యాభర్తలయ్యారు.

ఇంకేముంది..?

ఎలక్ట్రిక్ స్కూటల్ అమ్మేసి మళ్లీ బులెట్ కొన్నాడు.

– ఈ.ఎస్.మాధవన్

'సంఘీ' భావం



# చిన్న వయసులోనే గుండెపోటు

ఇటీవల కాలంలో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న చిన్నారులు గుండెపోటుతో మృతి చెందుతున్న ఘటనలు పెరుగుతున్నాయి. గతంలో 50 సంవత్సరాలు దాటితేనేగాని ఇలాంటి బెడద ఉండేది కాదు. ముఖ్యంగా కరోనా తరువాత చిన్నారుల్లో గుండెపోట్లు పెరుగుతున్నట్లు సర్వేలు చెబుతున్నాయి. అయితే ఇతర కారణాల వల్లే ఈ ముప్పు చిన్నారుల్లో ఎక్కువగా ఉందని హృద్రోగ నిపుణులు స్పష్టం చేస్తున్నారు. నిశ్చల జీవనశైలి, శారీరక శ్రమ లేకపోవడం, ఆధునిక పని దినం అంటే తరచుగా 8 నుంచి 10 గంటలు కూర్చోవడం, తరువాత సాయంత్రం వేళల్లో సోఫాపై కూర్చుని సోషల్ మీడియాను స్క్రోల్ చేయడం. వీడియో గేమ్స్‌తో కాలయాపన వంటి జీవనశైలి గుండె బలాన్ని తగ్గించి అనారోగ్య సమస్యలను పెంచుతోంది. దీనివల్ల ప్రధానంగా బరువు పెరగడం, శరీరమంతా రక్త ప్రసరణను మందగించడం ద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని నేరుగా పెంచుతుంది. దీనికి తోడు సాంప్రదాయ సమతుల్య భోజనం స్థానంలో ఫాస్ట్ ఫుడ్, ప్యాక్ చేసిన స్నాక్స్, చక్కెర పానీయాలు, అనారోగ్యకరమైన కొవ్వులు కలిగిన ఆహార పదార్థాలు ఎక్కువగా తింటుతున్నారు. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను పెంచి, రక్త నాళాలలో వాపును కలిగిస్తాయి. ఇవన్నీ ప్రారంభ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతాయి చిన్నారుల్లో, యువతలో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. పని ఒత్తిడి, ఆర్థిక ఆందోళన, తీవ్రమైన ఆలోచనలు కూడా వీటికి తోడు అవుతున్నాయి. ఈ డిజిటల్ యుగంలో, స్థిరమైన డిజిటల్ కనెక్టివిటీ అదనపు ఒత్తిడిని సృష్టిస్తుంది. అధిక ఒత్తిడి స్థాయిలో కొలెస్ట్రాల్, రక్తపోటును పెంచుతాయి. రక్త నాళాలలో వాపును ప్రోత్సహిస్తాయి, ఇవన్నీ గుండె సమస్యలకు గణనీయంగా దోహదం చేస్తాయి.

జన్యుపరంగా కుటుంబాల ద్వారా సంక్రమించే వారసత్వ లక్షణాల కారణంగా భారతీయులకు గుండె జబ్బులు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంది.జన్యు పరమైన ప్రమాదం నేటి అనారోగ్య కరమైన జీవనశైలి అలవాట్లతో కలిసినప్పుడు, అది గుండె ఆరోగ్యానికి ప్రమాదకరమైన పరిస్థితిని సృష్టిస్తుంది. అదేవిధంగా ధూమపానం,గుట్కా, పొగాకు, మద్యం అలవాట్ల వల్ల రక్త నాళాలు దెబ్బతింటాయి. ధమనులలో కొవ్వు నిల్వలు వేగంగా పేరుకుపోతాయి. అలాగే, యువతలో గుండెపోటుకు మాదకద్రవ్యాల వాడకం ప్రధాన కారణం. ఇండియన్ హార్ట్ అసోసియేషన్ సర్వే ప్రకారం భారతీయ పురుషులలో సగం గుండెపోట్లు 50 యేళ్లలోపు సంభవిస్తాయి. నియంత్రణ లేని సౌందర్య, అనుబంధ ఔషధాల వాడకం అందాన్ని పెంచే ఉత్పత్తులు, ఆహార పదార్థాలు పర్యవేక్షణ లేకుండా వాడటం వల్ల చిన్న వయస్సులోనే గుండెపోటుకు పెరుగుతున్న కారణం అవుతోంది. ఎందుకంటే వీటిలో చాలావరకు గుండెను ఒత్తిడికి గురిచేసే ఉద్దీపనలు/హార్మోన్లు దాగి ఉన్నాయి. వైద్య సలహా లేకుండా, లేదా నిర్ధారణ కాని గుండె జబ్బులు ఉన్న వ్యక్తులు అధిక మోతాదులో తీసుకున్నప్పుడు, ఈ పదార్థాలు గుండె లయకు అంతరాయం కలిగిస్తాయి, రక్తపోటును పెంచుతాయి. యువతలో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి. అదేవిధంగా జిమ్‌కి వెళ్ళేవారు జిమ్ సప్లిమెంట్లు, పనితీరును పెంచే వాటి మితిమీరిన వినియోగం చాలామంది తగిన మోతాదు లేదా ఆరోగ్య పరిస్థితుల గురించి తెలియకుండానే ప్రీవర్కౌట్ పౌడర్లు, కొవ్వు బర్నర్లు లేదా కండరాలను నిర్మించే సప్లిమెంట్లను తీసుకుంటారు. వాటిలో కొన్నింటిలో అధిక స్థాయిలో ఉద్దీపనలు లేదా బహిర్గతం చేయని పదార్థాలు ఉంటాయి, ఇవి ముఖ్యంగా తీవ్రమైన వ్యాయామాల సమయంలో అకస్మాత్తుగా గుండెపై ఒత్తిడిని కలిగిస్తాయి. భారీ వ్యాయామం యువతలో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతాయి.

అనాబాలిక్ స్టెరాయిడ్స్ వాడకం శరీరాన్ని ఎక్కువసేపు కష్టపడి పనిచేయడానికి బలవంతం చేస్తాయి, దీనివల్ల గుండె కండరాలు అనారోగ్యకరమైన రీతిలో పెద్దవిగా పెరుగుతాయి, గుండె రక్తాన్ని సరిగ్గా పంప్ చేయడం కష్టతరం చేస్తుంది. కాలక్రమేణా, ఇది క్రమరహిత హృదయ స్పందనలు, గుండె వైఫల్యం, ఆకస్మిక మరణానికి దారితీస్తుంది, ఫిట్‌గా ఉన్న యువకులలో కూడా, తరచుగా ముందస్తు హెచ్చరిక సంకేతాలు లేకుండా గుండె పనిచేయడం నిలిచిపోతుంది.

ఊపిరి తీసుకోవడంలో ఇబ్బందులు, ఎక్కువ ఆయాసం వస్తుంటే వయస్సుతో సంబంధం లేకుండా వైద్య పరీక్షలు చేసుకుంటే గుండెపోట్లను ముందుగానే నివారించే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

కవర్ స్టోరీ

షేక్ అబ్దుల్ హాకీం జాని

# డిజిటల్ ఉచ్చు.. బతుకులో చిచ్చు!



**ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా డిజిటల్ మోసాలు పెరిగిపోయాయని చాలామంది ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యావత్ ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్యల్లో ఒకటి డిజిటల్ మోసాలు.**

బ్యాంక్ అకౌంట్‌కి ఈ కేవైసి అప్డేట్ చేస్తామని చెప్పడం, లింకులు పంపడం, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు, డిస్కౌంట్ ఆఫర్స్, ఉద్యోగ అవకాశాలు ఇలా రకరకాలుగా స్మార్ట్ ఫోన్లకు యాపులు ద్వారా వాట్సాప్ ద్వారా ఇన్స్టాగ్రామ్ ద్వారా ఫేస్‌బుక్, యూట్యూబ్, టెలిగ్రామ్ ఇలా విభిన్న రకాలుగా నేరగాళ్ల ప్రజలకు ఎరవేసి దొరికిన వారి వద్ద దొరికినంత దోచుకుంటున్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా మోసగాళ్లు రెచ్చిపోతున్నారు. ఒక వ్యక్తిని ఆర్థికంగా దెబ్బతీయడానికి, వారి వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించడానికి ఇంటర్నెట్ ఆధారిత సేవలు, సాఫ్ట్‌వేర్‌లను ఉపయోగించి చేసే మోసాన్ని 'డిజిటల్ మోసం' అంటారు. ఇంటర్నెట్‌ను, స్మార్ట్‌ఫోన్లను ఆయుధంగా చేసుకుని వ్యక్తులను, సంస్థలను కొందరు వలపన్ని మోసం చేస్తున్నారు. కంప్యూటర్, మొబైల్ ఫోన్ ఉపయోగించి చేసే ప్రతి అక్రమ చర్యను ఖిడిజిటల్ నేరంఖి అని చెప్పవచ్చు. డిజిటల్ మోసాలు, డిజిటల్ నేరాలు అంటే కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్, సోషల్ మీడియా, బ్యాంకింగ్ యాప్‌లు వంటి డిజిటల్ సాంకేతికతలను ఉపయోగించి ఇతరులను మోసం చేయడం, నష్టం కలిగించడం ద్వారా జరిగే నేరాలు, ఇంటర్నెట్, డిజిటల్ పరికరాల ద్వారా అక్రమ లాభం పొందడం, వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం చేయడం, ఆర్థిక నష్టం కలిగించడం, మానసిక హాని చేయడం జరిగితే వాటిని డిజిటల్ మోసాలు, డిజిటల్ నేరాలు అంటారు. నేడు అతి ఎక్కువగా జరుగుతున్న డిజిటల్ మోసాలలో 12 రకాలు అతి ముఖ్యమైనవి అని చెప్పవచ్చు. ప్రజల్లో వీటి పట్ల అవగాహన పెరిగితే మోసపోకుండా, కొంతలో కొంత నష్టపోకుండా ఉండటానికి అవకాశం ఉంటుంది.

## లాటరీ బహుమతి మోసం

ఈ మోసంలో భాగంగా కె.బి.సి., ఐ.పి.ఎల్ లాటరీ గెలిచారు అని ఫోన్ చేస్తారు. ప్రాసెసింగ్ ఫీజు లేదా టాక్స్ అడుగుతారు. ఇటువంటి వాటికి ఆశపడి, అత్యాశ వల్ల ప్రజలు మోసపోతుంటారు. నిజానికి ఇటువంటి లాటరీ టిక్కెట్లును ప్రజలు కొనరు. పాల్గొనని లాటరీ ఎలా గెలుస్తారు? అని ఆలోచించాలి. అలా గెలవడం అసాధ్యం కదా అనే చిన్న లాజికు మరువకూడదు. టిక్కెట్టే కొనకపోతే బహుమతి ఎలా వస్తుంది అనే విషయం పట్ల ప్రజలు దృష్టి కేంద్రీకరించి ఇది మోసం అని తెలుసుకోవాలి.

## నకిలీ బ్యాంక్ కాల్స్ ఓటిపి మోసం

మోసగాళ్లు బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నట్టు నటిస్తూ ఫోన్ చేస్తారు. సందేహాస్పద లావాదేవీలు జరిగాయి కాబట్టి మీ ఖాతా బ్లాక్ అవుతుంది అని వారు మనల్ని భయపెడతారు. కెవైసీ అప్డేట్ కాలేదు. తర్వాత ఓటిపి, పిన్, సివివి అడుగుతారు. బ్యాంకుపై ఉన్న అపారమైన నమ్మకంతో ఇది వినగానే భయపడి మోసపోతుంటారు. ఇందులో నిజం ఏమిటంటే బ్యాంకులు ఎప్పుడూ ఓటిపి, పిన్, సివివి ఇత్యాదివి అడగవు, ఓటిపి అంటే మన సంతకం లాంటిదే అని గుర్తించాలి. దాన్ని మీరు చెపితే మీ డబ్బు తీసుకునే అనుమతిని ఎదుటి

వారికి ఇచ్చినట్లే. అందువల్ల జాగ్రత్తగా మసలుకోవాలి.

## వీడియో కాల్ బ్లాక్ మెయిల్ మోసం

స్మార్ట్‌ఫోన్ ఉన్నవారికి అజ్ఞాత వీడియో కాల్ వస్తుంది. పది సెకన్ల వారితో మాట్లాడుతూ చెప్పరాని మాటలు.. లాంటివి చేస్తే మన జీవితం అల్లకల్లోలమౌతుంది. అటువంటి పది సెకన్ల వీడియో వారి చేతికి చిక్కితే చాలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా ముఖాలు మార్చి, నిడివి పెంచి అసభ్యంగా చిత్రీకరించి డబ్బులు గుంజుతుంటారు. కొన్ని సందర్భాల్లో అచ్చం మనం మాట్లాడినట్లు రికార్డింగ్ చేసి మన జీవితంలో తుపాన్‌లు సృష్టిస్తుంటారు.

భయం, సిగ్గు వల్ల ప్రజలంతా మోసపోతుంటారు. పొరపాటున ఒక్కసారి మనం డబ్బులు ఇస్తే సింహానికి మాంసం రుచి చూపించినట్టే. ఇటువంటి మోసాలు ఇంకా పెరుగుతూ ఉంటాయి. మౌనంగా ఉంటే మోసగాళ్లకు సహాయం చేసినట్టే. ఈ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేస్తే రక్షణ పొందినట్టే.

## ఎ వన్ వాయిస్ క్లోనింగ్ కుటుంబ అత్యవసర మోసం

ఈ మోసంలో మన కుమారుడు, కుమార్తె గొంతుతో మాట్లాడుతున్నట్లు అభినయించి మోసం చేస్తారు. చాలా అత్యవసరమని ఆ గొంతుతో మాట్లాడుతూ డబ్బులు అడుగుతారు. ఇది వినగానే తల్లిదండ్రుల్లో భావోద్వేగం పెల్లుబికి భయపడిపోతారు. ఆ సమయంలో భయపడకుండా, మనకు వచ్చిన ఫోన్‌ను పట్టించుకోకుండా. ఆ నంబరుకు కాకుండా తిరిగి మీ పిల్లల ఫోన్ నంబరుకు ఫోన్ చేసి నిజాన్ని నిర్ధారించుకోవాలి. డబ్బులు చెల్లించే ముందు భయపడకుండా పిల్లలతో మాట్లాడి నిజనిర్ధారణ చేసుకోవాలి.



## నకిలీ వర్క్ ఫ్రం హోమ్ పార్ట్ టైమ్ జాబ్ మోసం

ఇంటి వద్దనే మీరు కూర్చుని సులభంగా సంపాదన అని చెబుతారు. వీడియోలకు లైక్ చేయడం, డేటా ఎంట్రీ, రివ్యూలు రాయడం లాంటి  పనులు చేస్తే చాలు అని నమ్మబలుకుతారు. తర్వాత రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించమని అడుగుతారు. ఆర్థిక అవసరాలతో పాటు అత్యాశ వల్ల వారి వలలో చిక్కుకుంటున్నారు. నిజమైన ఉద్యోగాలు ఎప్పుడూ డబ్బులు అడగవు అని గ్రహించాలి. డబ్బు చెల్లిస్తేనే ఉద్యోగం ఇస్తామంటే అది ఉద్యోగం ఎలా అవుతుంది. నేడు అనేక ఉద్యోగాలు లంచాలపై కాకుండా ప్రతిభపైనే వస్తున్నాయని తెలుసుకోవాలి.

## వాట్సాప్ డిపి ఫోటో మోసం

ఈ ప్రక్రియలో మీ స్నేహితుడు లేదా బంధువు ఫోటోను డిపిగా పెట్టుకుని మెసేజ్ చేస్తారు. అంకుల్ నా ఫోన్ పాడైంది. అత్యవసరంగా డబ్బులు పంపండి.. అని ఫోన్ వస్తుంది. అయ్యో పాపం.. అని భావోద్వేగానికి లోనుకావడం, ఎంత అవసరమో అని భావించడం వల్ల క్షణాల్లో మోసపోతున్నారు. కొత్త నెంబర్ నుంచి డబ్బులు అడిగితే అది ప్రమాద సూచన అని గ్రహించాలి. పాత నెంబర్‌కి ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి. డిపిలో పెట్టిన ఫోటో గుర్తింపు కాదు, నిర్ధారణే భద్రత అని తెలుసుకోవాలి.

## కస్టమ్స్ అంతర్జాతీయ పార్సెల్ మోసం

"మీ పార్సెల్ కస్టమ్స్‌లో ఆగింది" అని మనకు ఫోన్ వస్తుంది. డ్యూటీ లేదా ఫైన్ చెల్లించమంటారు. ఇది వినగానే మనకు చట్టపరమైన భయం కలుగుతుంది. మీరు ఆర్డర్ చేయకపోతే పార్సెల్ అనేది ఉండదు అని తెలుసుకోండి. అర్డర్ లేదు, పార్సెల్ లేదు అటువంటప్పుడు చెల్లింపు ఎలా ఉంటుంది? అనే లాజిక్‌ను మరువకండి. కస్టమ్స్ అనే వ్యవస్థ ఎన్నడూ ఫోన్లో డబ్బులు. అడగదు అని గ్రహించాలి.

## డిజిటల్ అరెస్ట్ మోసం నకిలీ పోలీస్ సిబిఐ కాల్స్

ఆధార్ నేరానికి లింక్ అయిందని లేదా బ్యాంక్ ఖాతా మనీలాండరింగ్‌లో వాడబడిందని, "మీరు డిజిటల్ అరెస్టులో ఉన్నారు" అని బెదిరిస్తారు. సాధారణంగా పోలీసులు ఇంటికి వస్తే పరువు పోతుందని చాలామంది భయపడతారు. వీడియో కాల్ చేసి డిజిటల్ అరెస్ట్ అంటే నమ్మకండి. పోలీసులు వీడియో కాల్ ద్వారా అరెస్ట్ చేయరు. పోలీసులు ఇంటికి వస్తే సెర్చ్ వారెంట్‌తో వస్తారు. వాట్సాప్ లేదా జూమ్‌లో చట్టపరమైన చర్యలు ఉండవు అని గ్రహించండి. చట్టం కోర్టు ద్వారా పనిచేస్తుంది. అంతే కానీ వీడియో కాల్ ద్వారా కాదు అనే చిన్న లౌక్యాన్ని మరువకండి.

## ఆన్‌లైన్ పెట్టుబడి ట్రేడింగ్ మోసం కృత్రిమ మేధ వీడియోలు

వాట్సాప్ టెలిగ్రామ్ గ్రూప్లలో నకిలీ లాభాలు చూపిస్తారు. సెలబ్రిటీలు ప్రోత్సహిస్తున్నట్లు నకిలీ వీడియోలు చూపిస్తారు. ఇవి చూసి అత్యాశకు పోయి ఇతరుల లాభాలను చూచి సునాయాసంగా నమ్మేస్తారు. అత్యాశ, ఇతరుల లాభాలు చూసి

నమ్మడం అనేది జరుగుతుంది. ఇందులో నిజం ఏమిటంటే గ్యారెంటీగా లాభాలు ఇచ్చే పెట్టుబడి ఏదీ లేదు. ఎక్కువ లాభాల హామీ అంటే ఎక్కువ మోసం అని గుర్తించాలి.

### నకిలీ ఆన్‌లైన్ షాపింగ్ మ్యాట్రిమోని మోసం

ఈ మోసంలో బ్రాండెడ్ వస్తువులు భారీ డిస్కౌంట్‌లో చూపిస్తారు. డబ్బులు చెల్లించిన తర్వాత వస్తువు రాదు. తక్కువ ధరలో వస్తుందని తొందర పడి అనేకమంది మోసపోతుంటారు. ఈరోజు చౌక అనేది రేపటి నష్టం అని భావించాలి.

### క్యూఆర్ కోడ్ చెల్లింపు మోసం

"డబ్బులు రావాలంటే ఈ స్కాన్ చేయండి" అంటారు. పొరపాటున మీరు స్కాన్ చేస్తే డబ్బులు పోతాయి. ఈ విధానం అర్థం కాకపోవడం వల్ల మోసపోతుంటారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం అంటే డబ్బులు చెల్లించడం మాత్రమే డబ్బులు రావాలంటే యూపీఐ ఐడీ ఇవ్వాలి.

### నకిలీ యాప్ ఏపీకే మోసం

కేవైసీ లోన్, కొరియర్ పేరుతో యాప్ ఇన్‌స్టాల్ చేయమంటారు. ఆ యాప్ ఓటీపీలు, బ్యాంక్ సమాచారం దొంగిలిస్తుంది. సాంకేతిక అవగాహన లోపం వల్ల మోసపోతున్నారు. బ్యాంకులు వాట్సాప్‌లో ఏపీకే ఫైళ్ళు పంపవు. యాప్‌లు కేవలం అధికారిక స్టోర్ నుంచే డౌన్‌లోడ్ చేయాలి. తెలియని యాప్ అంటే తెలియని ప్రమాదాన్ని తెచ్చిపెడతాయని గుర్తించాలి.

### పలు రకాల సైబర్ నేరాలు

సైబర్ నేరాలు అనేక రకాలుగా ఉంటాయి. కంప్యూటర్లు, నెట్‌వర్క్‌లలోకి చొరబడే నేరస్థులు వివిధ రకాల సైబర్ నేరాలకు పాల్పడేటప్పుడు వ్యక్తిగతంగా లేదా కలిపి ఉపయోగించే వివిధ రకాల హానికరమైన సాఫ్ట్వేర్, సోషల్ ఇంజనీరింగ్ పద్ధతులను అభివృద్ధి చేశారు. అత్యంత సాధారణ సైబర్ నేరాలను పలురకాలుగా ఉంటాయి.

### హ్యాకింగ్

హ్యాకింగ్ అనేది అనుమతి లేకుండా ఎవరి కంప్యూటర్, మొబైల్ ఫోన్, ఈమెయిల్, సోషల్ మీడియా ఖాతా లేదా బ్యాంక్ ఖాతాలోకి ప్రవేశించి వ్యక్తిగత సమాచారం దొంగిలించడం లేదా నష్టం చేయడం. పలు రకాలుగా హ్యాకింగ్ చేస్తుంటారు. హ్యాకర్లు నేరుగా మీ పాస్‌వర్డ్‌ను కనిపెట్టడం కంటే, మిమ్మల్ని బురిడీ కొట్టించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తారు. ఫిషింగ్ అనే పద్ధతి ద్వారా మీకు బ్యాంక్ నుండి వచ్చినట్లుగా ఒక నకిలీ మెయిల్ లేదా మెసేజ్ వస్తుంది. అందులోని లింక్ క్లిక్ చేయగానే మీ వ్యక్తిగత వివరాలు హ్యాకర్ల చేతికి వెళ్తాయి. మాల్వేర్ పద్ధతిలో మీరు తెలియని వెబ్‌సైట్ల నుండి సాఫ్ట్‌వేర్లు లేదా సినిమాలు డౌన్‌లోడ్ చేసినప్పుడు, వాటితో పాటు చిన్న వైరస్ ప్రోగ్రామ్లు మీ ఫోన్లోకి వచ్చి




మీ డేటాను దొంగిలిస్తాయి. కీ లాగింగ్ పద్ధతిలో మీరు కీబోర్డ్ మీద టైప్ చేసే ప్రతి అక్షరాన్ని రికార్డ్ చేసే సాఫ్ట్‌వేర్ ఇది. దీని ద్వారా మీ పాస్వర్డ్లు సులభంగా తెలిసిపోతాయి. సిమ్ స్వాపింగ్ పద్ధతి ద్వారా మీ ఫోన్ నంబర్‌పై డూప్లికేట్ సిమ్ కార్డు తీసుకుని, మీ బ్యాంక్ ఓటీపీలను హ్యాకర్లు పొందుతారు.

### హ్యాకర్ల నుండి ఎలా సురక్షితంగా ఉండాలి?

హ్యాకర్లు అనేక లక్ష్యాలను కలిగివుంటారు. ఈ వ్యవస్థల్లోని బలహీనతలను ఉపయోగించుకుని, హ్యాకర్లు వ్యక్తిగత సమాచారం, కార్పొరేట్ రహస్యాల నుండి ప్రభుత్వ నిఘా వరకు డేటాను దొంగిలిస్తారు. కంపెనీలు, ప్రభుత్వాల కార్యకలాపాలకు అంతరాయం కలిగించడానికి హ్యాకర్లు నెట్‌వర్క్‌లోకి కూడా చొరబడతారు. క్రిమినల్ హ్యాకింగ్ అంటే కంప్యూటర్ లేదా నెట్‌వర్క్‌ని డేటాను అనధికారికంగా యాక్సెస్ చేయడం. మీ బ్యాంక్ ఖాతాలోని డబ్బును కాజేసి ఆర్థికలాభం పొందడం, మీ వ్యక్తిగత ఫొటోలు, వీడియోలు, ముఖ్యమైన డాక్యుమెంట్ల డేటా చోరీ చేసి దొంగిలించి బ్లాక్ మెయిల్ చేయడం, మీ పేరుతో ఇతరుల దగ్గర అప్పులు తీసుకోవడం, నేరాలు చేయడం ఇలా హ్యాకింగ్ వల్ల అనేక నష్టాలు వాటిల్లుతాయి. అందువల్ల హ్యాకర్ల నుండి సురక్షితంగా ఉండటానికి అనేక నిబంధనలు పాటించాలి. బ్యాంక్ ఖాతా నుంచి డబ్బు మాయం, సోషల్ మీడియా ఖాతాల దుర్వినియోగం, వ్యక్తిగత ఫొటోలు, డేటా లీక్ అవడం, పేరుప్రతిష్టకు నష్టం, మీ సోషల్ మీడియా, బ్యాంక్ ఖాతాలకు టూఫ్యాక్టర్ అథెంటికేషన్‌ను తప్పనిసరిగా ఆన్ చేసుకోండి, పాస్‌వర్డ్ తెలిసినా ఓటీపీ లేకుండా ఎవరూ లాగిన్ కాలేరు. పేరు, ఫోన్ నంబర్ వంటివి కాకుండా అక్షరాలు, అంకెలు, గుర్తులు కలిపి కనీసం 12 అక్షరాల బలమైన పాస్‌వర్డును వాడండి. వాట్సాప్‌లో వచ్చే ఉచిత బహుమతులు, ఆఫర్లు వంటి అపరిచిత లింకులను ఎప్పుడూ క్లిక్ చేయకండి. రైల్వే స్టేషన్లు, హోటళ్లలో దొరికే ఉచిత పబ్లిక్

వైఫైని ఉపయోగించి బ్యాంకింగ్ లావాదేవీలు చేయకండి. ఒకవేళ మీరు హ్యాకింగ్‌కు గురైతే లేదా సైబర్ మోసం జరిగితే, వెంటనే 1930 నంబరుకు కాల్ చేయండి లేదా వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయండి. హ్యాకింగ్ ఒక నేరం. భారతదేశంలో ఐటీ యాక్ట్, 2000 ప్రకారం హాకింగ్కు శిక్షలు ఉన్నాయి.

## మాల్వేర్

డిజిటల్ మోసాల ప్రపంచంలో 'మాల్వేర్' పేరుతో జరుగుతున్న మోసం ప్రస్తుతం చాలా మందిని ఇబ్బంది పెడుతోంది. సైబర్ నేరాలలో మాల్వేర్ మోసాలు ప్రస్తుత రోజుల్లో చాలా క్లిష్టంగా మారిపోయాయి. మాల్వేర్ అంటే దురుద్దేశపూరిత సాఫ్ట్‌వేర్. మీ ప్రమేయం లేకుండానే మీ ఫోన్ లేదా కంప్యూటర్ నుండి డేటాను దొంగిలించడానికి దీనిని వాడుతుంటారు. అధికారిక ప్లే స్టోర్ లేదా యాపిల్ స్టోర్ కాకుండా, థర్డ్ పార్టీ వెబ్‌సైట్ల నుండి యాప్‌లు డౌన్‌లోడ్ చేసినప్పుడు ఈ ప్రమాదం ఎక్కువ, ఉదాహరణకు ఉచితంగా సినిమాలు చూసే యాప్‌లు, మోడ్ వెర్షన్ గేమ్స్, అశ్లీల కంటెంట్ ఉన్న యాప్ రూపంలో మాల్వేర్ వస్తుంది. మోసగాళ్లు ప్రసిద్ధ మార్వెల్ స్టూడియోస్ పేరును లేదా దానికి అనుబంధంగా ఉన్నట్లు చెప్పుకునే వెబ్‌సైట్లను వాడుకుంటారు.

ఈ పద్ధతి మొదటి దశలో మీకు వాట్సాప్ లేదా టెలిగ్రామ్ ద్వారా ఒక మెసేజ్ వస్తుంది. 'మాల్వేర్' సినిమాల రేటింగ్స్ పెంచడం ద్వారా లేదా ట్రైలర్స్ చూడటం ద్వారా ఇంట్లో కూర్చుని వేల రూపాయలు సంపాదించవచ్చు.. అని వారు ఆశ చూపుతారు.

మొదట్లో నమ్మకం కలిగించడానికి మీరు చిన్న చిన్న టాస్కులు ఇస్తారు. అవి పూర్తి చేయగానే మీ అకౌంట్‌లోకి 150 నుండి 500 వరకు జమ చేస్తారు. ఇది మిమ్మల్ని నమ్మించడానికి వారు వేసే గాలం తరువాత పెట్టుబడి పేరుతో దోపిడీ మొదలు పెడతారు. మీరు వారిని నమ్మిన తరువాత 'విఐపి టాస్క్‌లు' ఉన్నాయని, ఎక్కువ లాభం రావాలంటే మీరు కొంత డబ్బు డిపాజిట్ చేయాలని కోరతారు. మీరు రూ.5,000 కడితే రూ.7,000 వస్తాయని చెప్తారు. చివరి అంకంలో



మీరు లక్షల్లో డబ్బు కట్టిన తర్వాత, మీ అకౌంట్ బ్లాక్ అవుతుంది. లేదా ఆ డబ్బు విత్‌డ్రా చేసుకోవాలంటే మరికొంత 'టాక్స్' కట్టాలని అడుగుతారు. చివరికి మీరు కట్టిన డబ్బుతో వారు మాయమైపోతారు.

కొందరు మోసగాళ్లు కస్టమర్ కేర్ ప్రతినిధులమని నమ్మించి, మీ సమస్యను పరిష్కరిస్తామంటూ పలు రకాల యాప్‌లను ఇన్‌స్టాల్ చేయిస్తారు. దీనివల్ల మీ ఫోన్ స్క్రీన్ వారికి కనిపిస్తుంది. తద్వారా మీ పాస్‌వర్డ్‌ను వారు సులభంగా చూసి డబ్బులు కాజేస్తారు.

కీలాగర్స్ అనే పద్ధతి మీరు కీబోర్డ్ మీద టైప్ చేసే ప్రతి అక్షరాన్ని పాస్‌వర్డ్‌తో సహా రికార్డ్ చేసి నేరగాళ్లకు పంపిస్తాయి.

రాన్సమ్‌వేర్ అనే పద్ధతిని ఉపయోగించి మీ ఫైల్స్ అన్నింటినీ లాక్ చేసి, వాటిని తిరిగి ఇవ్వడానికి డబ్బులను రౌడీయిజం తరహాలో డిమాండ్ చేస్తారు. స్పైవేర్ విధానంలో మీ కెమెరా, మైక్రోఫోన్, గ్యాలరీని మీకు తెలియకుండానే పర్యవేక్షిస్తాయి.

## గుర్తింపు దొంగతనం

సైబర్ నేరాలలో గుర్తింపు దొంగతనం అనేది అత్యంత ప్రమాదకరమైన అంశం సరళంగా చెప్పాలంటే ఒక వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగత సమాచారాన్ని వారి అనుమతి లేకుండా దొంగిలించి, ఆ సమాచారంతో సదరు వ్యక్తిలా నటిస్తూ ఆర్థిక ప్రయోజనాలు పొందడానికి, ఇతర నేరాలు చేయడాన్ని 'ఐడెంటిటీ థెఫ్ట్' అంటారు.

ఒకరి వ్యక్తిగత సమాచారాన్ని పేరు, ఆధార్, క్రెడిట్ కార్డ్ నంబర్లు, పాస్‌వర్డ్ వారి అనుమతి లేకుండా దొంగిలించి, మోసపూరిత కార్యకలాపాలకు (బ్యాంక్ ఖాతాలు తెరవడం, అప్పులు తీసుకోవడం) ఉపయోగించడం చేస్తుంటారు. ఇది ఫిషింగ్ (నకిలీ ఇమెయిల్‌లు), మాల్వేర్, పబ్లిక్ వైఫై, సోషల్ మీడియా ద్వారా జరుగుతుంది. నేరస్థులు రకరకాల మార్గాల్లో మీ వివరాలను సేకరిస్తారు. ఫిషింగ్ అనే పద్ధతిలో మీకు బ్యాంక్ నుండి వచ్చినట్లుగా నకిలీ ఈమెయిల్స్ లేదా మెసేజ్లు పంపి, అందులోని లింక్ క్లిక్ చేయమని అడుగుతారు. అక్కడ మీ లాగిన్ వివరాలు నమోదు చేయగానే అవి నేరస్థులకు వెళ్తాయి. సోషల్ మీడియా మైనింగ్ పద్ధతిలో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి చోట్ల మీరు పెట్టే పుట్టినరోజు వివరాలు, ఫోన్ నంబర్లు, ఊరి వివరాలను సేకరించి మీ పాస్‌వర్డ్స్‌ను ఊహిస్తారు. రైల్వే స్టేషన్లు, హోటళ్లలో ఉండే ఉచిత వైఫైని ఉపయోగించి లావాదేవీలు చేసినప్పుడు హ్యాకర్లు మీ డేటాను సులభంగా దొంగిలించగలరు.

## సోషల్ ఇంజనీరింగ్

సైబర్ నేరాల ప్రపంచంలో 'సోషల్ ఇంజినీరింగ్' అనేది సాంకేతిక పరిజ్ఞానం కంటే ఎక్కువగా మనుషుల మనస్తత్వంతో ఆడుకునే

ఒక మాయాజాలం. సరళంగా చెప్పాలంటే హ్యాకర్లు మీ కంప్యూటర్‌ను హ్యాక్ చేయడానికి బదులు, మిమ్మల్ని మాటలతో బురిడీ కొట్టించి పాస్‌వర్డ్ వంటి మీ రహస్య సమాచారాన్ని మీ నుండే సేకరించడాన్ని 'సోషల్ ఇంజినీరింగ్' అంటారు. సైబర్ నేరాలలో సోషల్ ఇంజినీరింగ్ మోసాలు అంటే టెక్నాలజీని హ్యాక్ చేయడం కాకుండా, మనుషుల నమ్మకం, భయం, ఆశ, అవగాహన లోపాన్ని ఉపయోగించుకుని వ్యక్తిగత, ఆర్థిక సమాచారాన్ని దొంగిలించే మోసాలు. సాధారణంగా మోసగాళ్లు బ్యాంక్ సిబ్బంది, పోలీస్, ప్రభుత్వ అధికారి, స్నేహితుడు ఇలా తాము నమ్మదగిన వ్యక్తుల్లా నటించి మోసం చేస్తారు. "మీ అకౌంట్ బ్లాక్ అయింది" అని భయపెట్టడం, "మీకు కోటి రూపాయల లాటరీ తగిలింది" అని ఆశ చూపడం ఇలా మోసాలు చేస్తుంటారు.

ఒకటి కాదు రెండు కాదు ఇలా.. చెప్పుకుంటూ పోతే డిజిటల్, సైబర్ మోసాలు లెక్కలేనన్ని ఉన్నాయి. మన దేశంలో గత మూడేళ్లలో నమోదైన ఆన్‌లైన్ డిజిటల్, సైబర్ కేసుల వివరాల్లోకి వెళితే 2023లో 1, 310,361 కాగా 2024లో 1,918,852, నమోదు కాగా, 2025లో 2,177,524 కేసులు నమోదైనాలి. వైద్య వ్యవస్థపై సైబర్ నేరగాళ్ల కన్ను ఉంది. తరువాతి స్థానాల్లో విద్యా, రక్షణ రంగాలు ఉన్నాయి.

భారతదేశంపైనే సైబర్ దాడులు అధికంగా జరుగుతున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. 2023తో పోలిస్తే 2024లో ప్రపంచవ్యాప్తంగా సైబర్ దాడులు 44 శాతం పెరిగాయి, ప్రపంచంలోనే కీలక మౌలిక వ్యవస్థలు ఎదుర్కొంటున్న సైబర్ దాడుల్లో మన దేశం మొదటి స్థానంలో ఉంది. ప్రపంచ దేశాల్లోని మౌలిక వ్యవస్థలపై సగటున వారానికి 1,847 సైబర్ దాడులు జరిగాయి. మనదేశంలో అంతకుమించి మూడు రెట్లు సైబర్ దాడులు జరగడం ఆందోళన కలిగిస్తోంది. దేశంలోని మౌలిక వ్యవస్థలు సగటున వారానికి 3,291 సైబర్ దాడుల బారిన పడటం గమనార్హం. మనదేశంలో వైద్య రంగమే అత్యధికంగా సైబర్ దాడుల బారిన పడిందని అంచనా. సైబర్ నేరగాళ్లు దేశంలోని ప్రభుత్వ, ప్రైవేటు వైద్య వ్యవస్థలపై సగటున వారానికి 8,614 సైబర్ దాడులతో తెగబడ్డారు. సగటున వారానికి



7,983 సైబర్ దాడులతో విద్యారంగం రెండో స్థానంలోనూ, 4,731 దాడులతో రక్షణరంగం మూడో స్థానంలో ఉన్నాయి. 2024 మే నెలలో మనదేశంలో అత్యధికంగా సైబర్ దాడుల బారిన పడింది.

ఆ ఒక్క నెలలోనే వేలిముద్రలు, ఫేషియల్ స్కాన్లతో సహా ఏకంగా 500 జీబీ బయోమెట్రిక్ డేటా చౌర్యానికి పాల్పడ్డారు. ఢిల్లీలోని అలిండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) సహా దేశంలోని ముఖ్య వైద్య సంస్థలు సైబర్ దాడులతో హడలెత్తిపోయాయి.

వైద్యసంస్థల్లో రోగుల వ్యక్తిగత వివరాలను సైబర్ నేరగాళ్ళు కొల్లగొట్టారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (జెన్ ఏఐ) ద్వారా సైబర్ నేరగాళ్లు యథేచ్ఛగా సైబర్ దాడులకు తెగబడుతున్నారు. జెన్, ఏఐ ద్వారా దుష్ప్రచారం, డీప్ ఫేక్ వీడియోలు సృష్టించి సైబర్ దాడులకు పాల్పడటంతో పాటు బ్యాంకు ఖాతాల్లో నిధులు కొల్లగొట్టాడం, ప్రజాభిప్రాయాన్ని ప్రభావితం చేసేందుకు యత్నించారు.

ప్రధానంగా రిమోట్ యాక్సెస్ ట్రోజన్ల ద్వారా ఫేక్ అప్‌డేట్లతోనే ఈ సైబర్ దాడులకు పాల్పడుతున్నారు. మొత్తం సైబర్ దాడుల్లో 58 శాతం ప్రజల వ్యక్తిగత డేటా చౌర్యానికి పాల్పడినవే కావడం గమనార్హం.

86 కంటే ఎక్కువ కుటుంబాలు ఇప్పుడు ఇంటర్నెట్‌కు అనుసంధానించబడ్డాయి. భారతదేశంలో సైబర్ భద్రతా సంఘటనలు 2022లో 10.29 లక్షల నుండి 2024లో 2268 లక్షలకు పెరిగాయి. ఉన్నత విద్యావంతుల నుంచి సాధారణ ప్రజానీకం వరకు అత్యాశకు పోయి సైబర్ నేరస్తుల వలలో పడి లక్షలు పోగొట్టుకుని ఆర్థిక ఇబ్బందుల్లో ఇరుక్కుని జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు.

సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నంబర్ 1930కు ఫోన్ చేయాలి. ఆలస్యమైన కొద్దీ డబ్బులు తిరిగి పొందే అవకాశాలు తక్కువగా ఉంటుంది. కేవలం సంపూర్ణ అవగాహన ద్వారా మాత్రమే డిజిటల్ మోసాలను అరికట్టగలం. పాఠశాల స్థాయిలోనే పిల్లలచేత ప్రాజెక్టులు తయారు చేయించి విద్యార్థులను సైన్యంలా తీర్చిదిద్ది డిజిటల్ మోసాలపై యుద్ధ కొనసాగిస్తే తప్పకుండా ఇటువంటి వాటిని కొంతమేరకైనా అరికట్టవచ్చు. ■

## మౌన ముద్ర



పుస్తకం ముందు
చూపులా, బాణాలు
అక్షరాలతో
మస్తిష్కం చేసే పోరాటంలో
జ్ఞానం మౌనం.. వైనం
ఎందుకు?
సమస్యల
పరిష్కారాలు
కనుచూపు మేరలో
కనిపించనందుకు కాబోలు..

– బొరుసు రామచంద్రరావు

## దోచే ముఖాలు



నేను నడుస్తున్నాను
నేను నడిచే దారిలో
ఎదురుపడిన ఎన్నో కొత్త ముఖాలు..
అవి నడిచే నడకలో
సరికొత్త స్వరూపాలు!
ప్రతి మనిషికి ఒక ప్రత్యేక ముద్ర
ఉంటుందంటే అదేనేమో!
ఒకడి మొహానికి బొట్టుంటుంది
మరొకడికి మెడలో చైన్ ఉంటుంది
పాపం వాడికే ఒంటి మీద బట్ట
బరువు. తినడానికి తిండి కరువు!!
ఇచ్చే చెయ్యి.. తీసుకునే చెయ్యి
ఎప్పుడు రాజు ఎవడో...
పేద ఎవడో!
వేషాలు మారుతుంటాయి అంతే!
అందరూ భూమి మీదే..
అందరికీ గాలి అదే.. నీరు అదే
చెట్టూ పుట్టా అదే!
నేను నడుస్తున్నప్పుడు
ఉన్నట్లుండి నా నడక
మెలికలు తిరిగిపోతోంది
కాలం గాలి ఎటో తిప్పబడుతోంది
ఇప్పుడు ఇచ్చే చెయ్యి.. పుచ్చుకున్న
చేయి రెండిట్లో ఓపిక లేదు!
రెండిట్లో సత్తువ
ఏమాత్రం లేనే లేదు!
కాలం ఏంటో పాత ముఖాల్ని
చెరిపేసి కొత్త ముఖాల్ని
చిత్రించుకు పోవడానికి
సిద్ధమవుతోంది?!!

– చలపాక ప్రకాష్

ఈవారం కవిత్వం

## ఎద పొంగగా

రంగారు బంగారు సింగారి
చిరునవ్వుల చిలకమ్మా
జలకాలాడగ హృది కదిలి
మది మస్తిష్కాలలో ఏదో
అలజడి చెలరేగగా ఎద పొంగి ఈ
కవి అందించే
అక్షర కానుక
అందుకో ఓ నా చెలి
ఇహ...
నీటిలోకి కలువ భామ దిగితే
కలువలే వెలవెల బోవునేమో
అయినా నీటిలో ఉన్నట్లే
వర్ణించడం ఈ కవికేమి కొత్త కాదు
ఓ.. పసిడి ఛాయ పాలపొంగుల



రాణి
వలపు తేనెల చిలిపి నవ్వుల
హృదయ భామా
అందుకోవా ఈ అక్షరమాల
అలంకరించుకోవా మది మనసులో
ఓ.. పరువాల ప్రణయ ప్రణీతా
నఖశిఖ పర్యంతం నవమోహినిలా
మందార మకరంద నిష్యంద...
విలాస విలాసినిలా గోచరించే
ఓ... జీవనజ్యోతీ
ఆ శిఖరాలు అద్భుత
కళాఖండాలవోలె
నిండుగా గుండెలపై
దోబూచులాడుతున్నట్లు
చూపరులకు దిమ్మ తిరుగునట్లుగా
అందాల ఓ భరిణ
కరుణామృత హరిణీ
ఎప్పుడైనా నీట మునిగితే
తీయని రసధారలతో వర్ణించాలని
చిన్నకోరిక
ఇహ ఆపనా ఓ బంగారు
ఎంత రాసినా
ఈ సౌందర్య పిపాసిపై తక్కువే
అందుకే ఈ అక్షరార్చన మాలిక
అలంకరించుకో ఎదలో
ఓ నా 'వనితా' కవితా!

– డా॥ కొరుప్రోలు హరనాథ్

## అంతరంగిక సంపద

పెద్ద పెద్ద విలాసమైన భవనాలు
కడితే ఏం లాభం?
మనసు గదులు చిన్నగా ఉంటే
వెండి వెన్నెలలో రోజు తిరుగుతూ
ఉంటే ఏం లాభం?
మనసు పొరల్లో చీకటి
అలుముకుంటే
ఎంత ధనం ఉంటేనేమి?
దయ లేనిది
ఎంత బలముంటేనేమి ప్రేమ లేనిది
ఎంత పలుకుబడి ఉంటేనేమి
నిజాయితీ లేనిది సత్యము లేని
శ్వాస
శాంతి లేని ఆశ
నిండుతనాన్ని ఇవ్వవు
అహంకారం నశిస్తే
ఆనందం వశమవుతుంది
సంతృప్తి నీ హృదయంలో ఉంటే
స్వర్గం దిగి వస్తుంది
బాహ్యసంపద క్షణికమైతే
అంతరంగిక సంపద శాశ్వతమైనది
సంపూర్ణ ఆత్మసమర్పణం
కలిగిన వాడే
నిజమైన సంపద కలవాడు.

– చల్లా రమేష్ కుమార్

సింగిల్ పేజీ కథ

# సెల్యూట్

ఆ పట్టణమంతా విషాద ఛాయలు అలముకున్నాయి. "కల్నల్ సందీప్ అమర్ రహే" అనే నినాదాలు ప్రతి వీధిలోనూ మార్మోగుతున్నాయి. ప్రధాన రహదారులు క్యాండిల్ ర్యాలీలతో కాంతులీనాయి. ఆ నియోజకవర్గ శాసన సభ్యుడు, ఆ జిల్లాకు చెందిన మంత్రివర్యులు ఆఘమేఘాల మీద కల్నల్ సందీప్ స్వగృహానికి చేరుకున్నారు. ఆ ఇంటి ముందు ఏర్పాటు చేయబడిన షామియానా కింద ఉంచిన సందీప్ పెద్ద ఫొటోను అతి భారీ పూల దండలతో అలంకరించారు.

కల్నల్ సందీప్ కుటుంబ సభ్యులు అందరూ విషాద వదనంలో నిమగ్నులై ఉన్నారు. పట్టణంలోని ప్రజానీకం ఆ ఇంటికి చేరుకుంటున్నారు.

అది ఒక పెద్ద బంగళా. కల్నల్ సందీప్ కాశ్మీర్ సరిహద్దులోని ముష్కరులతో అవిశ్రాంతంగా పోరాడి అమరుడయ్యాడు. అతను తన ప్రాణాలను కోల్పోయే ముందు కొన్ని వందల మంది సామాన్య ప్రజానీకాన్ని ఆ ముష్కరుల బాంబుల దాడుల నుంచి రక్షించాడు. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చర్యలు తీసుకున్నాడు.

ధైర్యంగా తీవ్రవాదులు దాగిన ఆ గృహంలోకి ప్రవేశించి పది మందిని, తాను తీవ్ర గాయాలకు లోనైనా కూడా ఆ నాయకుడిని సైతం మట్టుబెట్టి తన ప్రాణాలను వదిలాడు.

ఈ వార్త తెలుసుకున్న అతని భార్య నీలిమ, ఐదేళ్ల కూతురు, అతని తల్లిదండ్రులు శోక పర్యంతం అయ్యారు. తమను పరామర్శించడానికి వస్తున్న వేలాది మందిని చూసి గుండె నిబ్బరం చేసుకున్నారు. బంగళా మీద నుంచే అందరికీ ముకుళిత హస్తాలతో అభివాదం చేశారు.

కల్నల్ సందీప్ కలిగినింటి బిడ్డ. అనేక వ్యాపారాలకు ఏకైక వారసుడు. చిన్నతనంలోనే పాఠాలతో పాటు దేశభక్తిని కూడా ఒంట పట్టించుకున్నాడు. సరిహద్దు పోరులోను, యుద్ధ రంగంలోనూ అశువులు బాసిన వీర జవాన్లను తలచుకుని అసూయ చెందేవాడు.

"చావంటే ఇలా ఉండాలి. బతుకు దేశం కోసం అర్పణ చేయాలంటే పెట్టి పుట్టాలి" అని అనుకునేవాడు. ఆ వీర జవాన్లకు జరిగిన అంతిమ వీడ్కోలును టీవీలో చూసి ఎంతో ఉత్తేజాన్ని పొందేవాడు. అప్పుడే నిర్ణయించుకున్నాడు తానూ సైన్యంలో చేరి దేశసేవ చేయాలని. రెండు మూడు తరాలకు సరిపడా సంపద ఉంది. అతనికి ఉద్యోగం చేయవలసిన అవసరం లేదు. అయినా ఏదో సాధించాలి.. ఇదే తపన..



తనకు పెళ్లి చూపుల సమయంలో నీలిమకు చెప్పాడు తన ఆశయాన్ని " నేను సైన్యంలో చేరాలని నిర్ణయించుకున్నాను. మీకు అభ్యంతరం లేకపోతేనే నాతో వివాహానికి సమ్మతించండి" అని.

ఇంకా ఇరవై ఏళ్ళు కూడా లేని నీలిమ ఎంతో పరిణతి చెందిన విధంగా ఒకటే మాట చెప్పింది.

"దేశ సేవలో నా భర్త నిమగ్నం అయితే నాకు అంతకంటే కావలసింది ఏముంది? అదే నాకు ఆనందం కూడాను. ఏ సాఫ్ట్‌వేర్‌నో, ప్రభుత్వ ఉద్యోగినో వివాహం చేసుకుంటే నేను ఒక సాధారణ గృహిణిగా మాత్రమే మిగిలిపోతాను" అని.

ఇక కల్నల్ సందీప్ పార్థివ శరీరం ఆ ఇంటికి చేరుకుంది. ఒక పేటికలో ఉంచిన ఆ నిర్జీవ దేహంపై నిండుగా త్రివర్ణ పతాకం కప్పి ఉంది. మధ్యాహ్నం నుంచే సందీప్ అంతిమ యాత్ర, సైనిక వందనాలతో, ప్రభుత్వ లాంఛనాలతో ప్రారంభం అయింది. "వీర సైనికుడా.. నీకు ఘన నివాళులు" అంటూ వేలాది జనాలు అతనికి అంతిమ వీడ్కోలు పలికారు.

....................

రెండు నెలల అనంతరం ఆ జిల్లా మంత్రిగారి చొరవతో ఆ పట్టణంలో రూపుదిద్దుకున్న శిలా విగ్రహానికి, సాక్షాత్తు రాష్ట్ర ముఖ్యమంత్రి ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన కల్నల్ సందీప్ ఇంటికి చేరుకున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం తరపున భారీ క్యాష్ అవార్డును ప్రకటించడమే కాకుండా, నీలిమకు ఆమె విద్యార్హతలకు తగిన ప్రభుత్వ ఉద్యోగాన్ని, రాజధానిలో 300 చ. గజాల స్థలాన్ని కేటాయించినట్లు ప్రభుత్వ నిర్ణయాన్ని తెలిపారు.

కల్నల్ సందీప్ సతీమణి నీలిమ ముఖ్యమంత్రి గారికి చేతులు జోడించి కృతజ్ఞతలు తెలుపుతూ "సార్, మీ ఆదరణ, ఆప్యాయతలుకు ధన్యవాదాలు. నా భర్త దేశం కోసం వీర మరణం పొందారు. వీరపత్నిగా మిగిలిపోవటం నా పూర్వ జన్మ సుకృతం. అయితే, ప్రభుత్వం తరపున మీరు ప్రకటించినవేవీ నేను స్వీకరించదలచుకోలేదు. నన్ను క్షమించండి" అంటూ ఎంతో వినయంగా తెలిపింది.

అనంతరం న్యూ ఢిల్లీలో జరిగిన రిపబ్లిక్ డే వేడుకల్లో రాష్ట్రపతి చేతుల మీదుగా 'పరమ వీర చక్ర' పతకాన్ని అందుకుంటూ సగర్వంగా జాతీయ పతాకానికి సెల్యూట్ చేసింది నీలిమ.

– పంతంగి శ్రీనివాసరావు

# 'ఖాన్-ఇ-జెహాన్ తెలంగీ'- నాగయ్య గన్నవిభుడు

అపర చాణుక్యుడు, స్థిత ప్రజ్ఞుడైన మేధావి పాములపర్తి వెంకట నరసింహారావు, భారతదేశ ప్రధాని అయిన తొలి తెలంగాణ వాసిగా, తెలుగు రాష్ట్రాలు సగర్వంగా గుర్తు చేసుకోవడం సహజం. అదే తెలంగాణ సీమకు చెందిన మరొక రాజనీతిజ్ఞుడు, వరంగల్ నుంచి వెళ్లి ఢిల్లీ సింహాసనం వజీర్ అయిన చారిత్రక కథనం, చరిత్ర పుటలలో నిక్షిప్తమై ఉంది. వరంగల్ కాకతీయ సామ్రాజ్య వైభవం క్షీణించి, తుగ్లక్ పాలన కొనసాగుతున్న నాటి దుర్దశ కాలం అది.

700 సంవత్సరాల కాలగర్భంలో 1323లో మహమ్మద్ బీన్ తుగ్లక్ సైన్యం వరంగల్‌ను కైవసం చేసుకొన్న కాలం అది. కాకతీయ సామ్రాజ్యధినేత నాటి ప్రతాపరుద్రున్ని బందీగా పట్టుకొని, ఎంపిక చేసిన కొందరు టర్కిష్ సైనికులు తుగ్లక్ ఆదేశానుసారం, ఢిల్లీ తరలించే ప్రయాణంలో, నర్మదా నదీ తీరంలో ప్రతాపరుద్రుడు తన జీవితాన్ని అంతం చేసుకొన్నట్లు తెలుస్తోంది. తుగ్లక్ పాలనా కాలంలో హిందు సంస్కృతి, నాగరికత విధ్వంసంగా దుష్టపాలన చెలరేగింది. దేవాలయాలు విధ్వంసనానికి గురి అయ్యాయి. మతమౌఢ్యం మరింత పెచ్చు పెరగటంతో, బలవంతంగా మతమార్పిడి కారణంగా ఊళ్ళు, మనుషుల పేర్లు కూడా మారిపోయి దుష్ట సంస్కృతి రాజ్యం చేసింది. తుగ్లక్ సైన్యాన్ని ఎదుర్కొని వీరస్వర్గం అలంకరించిన యోధులు అసంఖ్యాకమైనా, ఒత్తిడి, అణచివేత, హింసా దౌర్జన్యాల కారణంగా అంతవరకు కాకతీయ చక్రవర్తికి విధేయులుగా వ్యవహరించినవారు మత మార్పిడి అనుసరించి మతం మార్చుకొని, ముస్లిమ్ పేర్లు పెట్టుకొన్నారు. ఓరుగంటికి సుల్తాన్ పూర్ పేరు పెట్టి, అమీర్లు, మాలిక్‌లు పాలన చేపట్టారు. ఓరుగల్లు పతనంతో క్రీ.శ.1323, కాకతీయ చక్రవర్తుల చివరి పాలనా సంవత్సరంగా స్థిరీకరించబడింది.



ప్రముఖ తెలుగు కవి మారన తన మార్కండేయ పురాణంలో కాకతీయ ఆఖరి చక్రవర్తి ప్రతాపరుద్రుడికి, పాలనా కాలంలో సేవలందించిన నాయకులను కొందరిని పేర్కొన్నాడు. వారిలో నాగయగన్నయ ఒక అధికారి. మారన కవి, మార్కండేయ పురాణాన్ని ఆంధ్రీకరించి, ప్రతాపరుద్రుని సేనాని అయిన నాగయగన్ననికి అంకితం యిచ్చాడు. నాయక హోదా పొందిన గన్నయ్య కటకపాలునిగా (కాకతీయ రాజధాని రక్షకుడు) నీతి యుగంధరుడని పేరు పొందినట్టు కాకతీయ చరిత్ర స్పష్టం చేస్తోంది. 'కన్ను' లేక 'కత్తు' ప్రధాన రాజధాని రక్షకుడైన గన్నయను కూడా ఢిల్లీ సుల్తాన్, కాకతీయ చక్రవర్తిని బంధించి తీసుకువెళ్లేటప్పుడు, ఢిల్లీ చేర్చాడని ముస్లిం చరిత్రకారుడు షమ్స్-ఇ-సిరాజ్ అసిఫ్ రచన తెలియచేస్తోంది. మధ్య దారిలో ప్రతాపరుద్రుడు మరణించిన సంఘటన, గన్నయ విభుని జీవితాన్ని మార్చివేసింది. వరంగల్ నుంచి ఢిల్లీ చేర్చిన నాగయ్య గన్నవిభుడు, మహమ్మద్ బీన్‌తుగ్లక్ విధేయునిగా, ఏ పరిస్థితుల్లో మతమార్పిడికి పాల్పడినదీ వివరాలు తెలియరాలేదు. తుగ్లక్ పాలనలో 'మాలిక్ మక్బుల్ తెలంగి' గా, మారిన గన్నయ,'ఖాన్-ఎ-జహాన్‌గా (లార్డ్ ఆఫ్‌ది వరల్డ్)గా బిరుదు పొంది క్రమేపీ రాజ్యపాలనా అగ్రేసరుడయ్యాడు. మఖ్‌బుల్ ఖాన్ పేరిట భోగ, భాగ్యాలతో తులతూగాడు. 1351 నుండి ఢిల్లీ సామ్రాజ్యాన్ని ఫిరుజ్ షా తుగ్లక్ పాలనా కాలంలో, మఖ్‌బుల్ ఖాన్ ఆర్థిక మంత్రిగా కీలక పాలనా బాధ్యతలు చేపట్టాడు. 'ఖాన్-ఎ-జహాన్' ముస్లిమ్ సామ్రాజ్యధీశునిగా 'వజీర్' లేదా ప్రధాన మంత్రి కాగలిగాడు. తుగ్లక్ జమానాలో సన్న, చిన్న నిరుపేద రైతాంగం నడ్డి విరక్కొట్టే ఋణాల ఊబిలో కూరుకుపోవడం నాటి వజీర్‌కు ఆవేదన కలిగించింది. మఖ్‌బుల్ ఖాన్ అయిన నాగయ్యగన్న విభుని పాలనా దీక్షా దక్షతలకు, నాటి తుగ్లక్ వారస పాలకుడు ఫిరుజ్ షా తుగ్లక్, బద్ధుడై జోహుకుం స్థాయికి చేరాడు. అంతే, ఋణ ఖాతా రికార్డులన్నీ అగ్నిమంటలకు ఆహుతి అయ్యాయి. రైతాంగ ఋణాల బకాయి నాటి తుగ్లక్ ప్రభుత్వం, మఖ్‌బుల్ ఖాన్ పాలన ఆదరణ వలన రద్దు కావడం చారిత్రక సత్యంగా ప్రతిష్ఠ తెచ్చింది. దక్కన్ పీఠభూమి అఖండ భారతావనికి ఎక్కడో దక్షిణాది ముఖద్వారంలోని తెలంగాణ సీమ నుంచి ఎవరూ ఊహించలేని, విచిత్ర అగమ్యగోచర స్థితిగతులలో ఢిల్లీలో వజీర్‌గా (అంటే ప్రధాని) చక్రం తిప్పిన ఖాన్-ఎ-జెహాన్ తెలంగీ, జీవితం భోగభాగ్య విలసితంగా 2,000 మంది జనానా ఖానా పరివార కుటుంబం కొనసాగింది. రాణులలో గ్రీక్, చైనా విదేశీ మహిళలు కూడా వుండేవారు. వజీర్ మక్బూల్‌కు, నాటి తుగ్లక్ ఢిల్లీ సుల్తాన్ ఒక కొత్త పాలనా నిబంధన కానుకగా ఇచ్చాడు. వజీర్‌కు కొడుకు పుట్టినప్పుడల్లా, 1000 బంగారు నాణాల ఆదాయం పెంపు కానుకగా వుండేది. నాగయ్య గన్న విభునిగా పుట్టిన వరంగల్లు కాకతీయ సేనాని, 'ఖాన్-ఎ-జెహాన్' తెలంగీ మఖ్బూల్ ఖాన్‌కు, దేశ రాజధాని ఢిల్లీ, నిజాముద్దీన్ బస్తీలో వైభవోపేతమైన దర్గాను కొడుకు జునాన్‌షా నిర్మింపచేసాడు.

– జయసూర్య

**ప్రేమికుల రోజు అనేది ప్రస్తుత సమాజంలో కేవలం ఒక పండుగగా మాత్రమే కాదు, మానవ భావోద్వేగాల వికాసాన్ని, సమాజ పరిణామాలను, సాంస్కృతిక మార్పులను ప్రతిబింబించే ఒక సామాజిక దినంగా మారింది.**

# భావోద్వేగ దినం

ఫిబ్రవరి 14న ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఈ దినోత్సవానికి వెనుక ఉన్న చరిత్ర, పూర్వాపరాలు, సంఘటనలు, మత-సాహిత్య నేపథ్యం, ఆర్థిక ప్రభావాలు, సామాజిక ప్రతిఫలాలు అన్నీ కలిసి దీనిని విశ్లేషించాల్సిన అవసరం ఏర్పడింది. ప్రేమ భావనను నిలిచిపోయినప్పటికీ దానిని వ్యక్తపరచే పద్ధతులు మాత్రం యుగయుగాలుగా మారుతూ వచ్చాయి. ప్రేమికుల రోజు సందర్భంగా ఆ మార్పుల సమగ్ర రూపం.

ప్రాచీన రోమ్ సామ్రాజ్య కాలమే ప్రేమికుల రోజు చరిత్రకు ఆరంభంగా పరిగణించబడుతుంది. క్రీ.శ. మూడవ శతాబ్దంలో రోమ్‌ను పాలించిన చక్రవర్తి క్లాడియస్-II యుద్ధాల్లో పాల్గొనే సైనికులు కుటుంబ బంధాల వల్ల యుద్ధానికి ఆసక్తి చూపడం లేదన్న అభిప్రాయంతో యువకుల వివాహాలను నిషేధించినట్టు చరిత్రకారులు పేర్కొంటారు. ఆ సమయంలో క్రైస్తవ మత బోధకుడిగా పేరుగాంచిన వాలెంటైన్ అనే పూజారి ఆ ఆజ్ఞలను ధిక్కరించి రహస్యంగా వివాహాలు జరిపాడని సంప్రదాయం చెబుతుంది. ప్రేమ, కుటుంబం మానవ జీవితానికి మూలాధారాలన్న నమ్మకంతో అతడు చేసిన ఈ కార్యం అధికారులకు తెలిసి, అతడిని కారాగారంలో బంధించారు. చివరకు క్రీ.శ. 269 ప్రాంతంలో అతడికి మరణశిక్ష విధించబడింది. ఈ సంఘటన వాలెంటైన్‌ను ప్రేమకు ప్రతీకగా నిలబెట్టింది.



వాలెంటైన్ కారాగారంలో ఉన్న సమయంలో కారాగార అధికారి కుమార్తెతో ఏర్పడిన అనుబంధం, ఆమెకు రాసిన లేఖ, చివరగా 'యోర్ వాలెంటైన్' అని సంతకం చేసినట్టు ప్రచారంలో ఉన్న కథనం ప్రేమికుల రోజు భావోద్వేగానికి బలమైన ఆధారంగా మారింది. చరిత్ర పరంగా ఈ కథనాలకు ప్రత్యక్ష ఆధారాలు తక్కువగానే ఉన్నప్పటికీ, ప్రజల మనసుల్లో అవి గాఢంగా నిలిచిపోయాయి. ఈ సంఘటనల తరువాత శతాబ్దాల పాటు వాలెంటైన్ పేరు ప్రేమకు పర్యాయంగా మారింది. క్రీ.శ. 496లో పోప్ గెలాసియస్-I ఫిబ్రవరి 14ను సెయింట్ వాలెంటైన్ దినంగా ప్రకటించడంతో ఇది అధికారిక మత పండుగగా స్థిరపడింది.

అయితే ప్రేమికుల రోజు ఆరంభం కేవలం క్రైస్తవ సంప్రదాయంతోనే పరిమితమని చెప్పలేం. ప్రాచీన రోమ్‌లో ఫిబ్రవరి మధ్యలో జరుపుకునే లూపర్కేలియా అనే పండుగకు దీనితో సంబంధం ఉందన్న వాదన బలంగా ఉంది. ఈ పండుగ సంతానోత్పత్తి, ప్రకృతి పునరుజ్జీవనాన్ని సూచించేది. ఆ పండుగలో భాగంగా యువకులు-యువతులను జంటలుగా కలిపే ఆచారాలు ఉండేవని చరిత్ర చెబుతుంది. క్రైస్తవ మతం విస్తరించిన తర్వాత పాత ఆచారాలను కొత్త మత పరమైన పండుగలతో భర్తీ చేసే ప్రక్రియలో లూపర్కేలియా స్థానంలో సెయింట్ వాలెంటైన్ దినం ప్రవేశించిందన్న అభిప్రాయం కూడా ఉంది. ఈ విధంగా ప్రేమికుల రోజు మత పరమైన మార్పులకు ప్రతీకగా మారింది.

మధ్యయుగ యూరప్‌లో ప్రేమికుల రోజు మరో కొత్త మలుపు తిరిగింది. 14వ శతాబ్దంలో ఇంగ్లండ్‌కు చెందిన కవి జెఫ్రీ చాసర్ తన రచనల్లో ఫిబ్రవరి 14ను పక్షులు తమ జంటను ఎంచుకునే రోజుగా పేర్కొన్నాడు. ఆ కవితలు రాజసభలలో, విద్యావంతుల మధ్య విస్తృతంగా ప్రచారం పొందడంతో ప్రేమికుల రోజు సాహిత్యపరమైన ప్రాముఖ్యతను సంతరించుకుంది. అక్కడి నుంచి ప్రేమను బహిరంగంగా వ్యక్తపరచడం, కవితలు రాయడం, ప్రేమలేఖలు పంపడం వంటి సంప్రదాయాలు విస్తరించాయి. ఈ కాలంలో ప్రేమను ఆధ్యాత్మికతతో, నైతికతతో ముడిపెట్టి చూడడం ప్రారంభమైంది.

18వ శతాబ్దం నాటికి యూరప్‌లో ప్రేమికుల రోజు సామాజిక సంప్రదాయంగా మారింది. చేతిరాత కార్డులు, ప్రేమలేఖలు పంపడం సాధారణమైంది. పారిశ్రామీకరణ ప్రారంభమైన 19వ శతాబ్దంలో ముద్రిత కార్డుల తయారీ పెరిగి, ప్రేమికుల రోజు వ్యాపార రంగంతో

గాఢంగా అనుసంధానమైంది. ఈ దశలో ప్రేమ భావన వ్యక్తిగత పరిధిని దాటి, మార్కెట్ ఆర్థిక వ్యవస్థలో భాగమైంది. పూలు, చాక్లెట్లు, బహుమతులు ప్రేమకు ప్రతీకలుగా మారాయి. ఈ పరిణామం ఆధునిక ప్రేమికుల రోజు రూపకల్పనకు పునాది వేసింది. ఆధునిక కాలంలో ప్రేమికుల రోజు ప్రపంచ వ్యాప్తంగా భారీ ఆర్థిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది.

అంతర్జాతీయ మార్కెట్ అంచనాల ప్రకారం ప్రతి ఏడాది ఈ దినం సందర్భంగా బహుమతులు, పూలు, ఆభరణాలు, రెస్టారెంట్ సేవలు, ప్రయాణ రంగాల్లో వందల బిలియన్ల డాలర్ల వ్యాపారం జరుగుతోంది. అమెరికాలోనే ప్రేమికుల రోజు ఖర్చు 20 బిలియన్ డాలర్లను మించుతుందని మార్కెట్ అధ్యయనాలు సూచిస్తున్నాయి. పూల వ్యాపారంలో ఈ రోజు అమ్మకాలు సాధారణ రోజులతో పోలిస్తే రెండు నుంచి మూడు రెట్లు పెరుగుతాయి. చాక్లెట్ పరిశ్రమ, కార్డు పరిశ్రమకు ఈ దినం కీలక ఆదాయ వనరుగా మారింది.

భారతదేశంలో ప్రేమికుల రోజు ప్రాచుర్యం పొందిన తీరు ప్రత్యేకంగా విశ్లేషించదగినది. సంప్రదాయ బద్ధమైన సమాజంలో ప్రేమను బహిరంగంగా వ్యక్తపరచడం అంత సులభం కాకపోయినప్పటికీ, 1990ల తరువాత గ్లోబలైజేషన్, ఉపగ్రహ టెలివిజన్, సోషల్ మీడియా ప్రభావంతో యువతలో ఈ దినం వేగంగా వ్యాపించింది. మొదట మెట్రో నగరాల్లో ప్రారంభమైన ఈ సంస్కృతి క్రమంగా చిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. ప్రేమను వ్యక్తపరచుకునే ఒక అవకాశంగా యువత దీన్ని స్వీకరించింది. అదే సమయంలో ఇది పాశ్చాత్య సంస్కృతి ప్రభావమని విమర్శలు, నిరసనలు కూడా ఎదురయ్యాయి.

భారతీయ సందర్భంలో ప్రేమికుల రోజు కుటుంబ వ్యవస్థ, సామాజిక నియమాలు, సంప్రదాయ విలువలతో ఘర్షణకు దారి తీసింది. ప్రేమ వివాహాలు, యువత స్వేచ్ఛపై చర్చలు ఈ దినం చుట్టూ ఎక్కువయ్యాయి. కొన్నిచోట్ల నైతిక పోలీసింగ్ పేరుతో యువ జంటలపై ఆంక్షలు విధించిన సంఘటనలు కూడా చోటు చేసుకున్నాయి. ఈ సంఘటనలు వ్యక్తిగత స్వేచ్ఛ, సామాజిక నియంత్రణ మధ్య ఉన్న సంఘర్షణను బయటపెట్టాయి. అదే సమయంలో ప్రేమికుల రోజు మహిళల భద్రత, సమానత్వం, పరస్పర గౌరవం వంటి అంశాలపై కూడా



చర్చకు దారితీసింది.

విశ్లేషణాత్మకంగా చూస్తే ప్రేమికుల రోజు రెండు విభిన్న కోణాలను కలిగి ఉంది. ఒకవైపు ఇది ప్రేమను వ్యక్తపరచుకునే స్వేచ్ఛకు ప్రతీకగా నిలుస్తోంది. భావోద్వేగాలను దాచిపెట్టే సమాజాల్లో ఈ దినం ఒక వేదికగా మారింది.

ప్రేమ అనేది సహజమైన మానవ భావమన్న అవగాహనను ఇది పెంచింది. మరోవైపు, ఈ దినం ప్రేమను వినియోగ వస్తువులుగా మార్చే ధోరణిని కూడా బలపరిచింది. ఖరీదైన బహుమతులు ఇవ్వలేకపోతే ప్రేమ తక్కువగా భావించబడే పరిస్థితి ఏర్పడింది. ఇది సంబంధాల్లో ఒత్తిడిని, ఆర్థిక భారం పెంచుతోంది. ప్రేమికుల రోజు సామాజిక మాధ్యమాల యుగంలో మరింత కొత్త రూపం దాల్చింది. ఫొటోలు, స్టేటస్‌లు, పోస్టుల ద్వారా ప్రేమను ప్రదర్శించాల్సిన ఒత్తిడి యువతపై పెరిగింది. వ్యక్తిగత భావం బహిరంగ ప్రదర్శనగా మారింది. ఇది కొందరికి ఆనందాన్ని ఇస్తే, మరికొందరికి అసంతృప్తిని కలిగిస్తోంది. ప్రేమను ఇతరులతో పోల్చుకునే ధోరణి పెరగడం సంబంధాల్లో అస్థిరతకు దారి తీస్తోంది. ఈ పరిణామాలు ప్రేమికుల రోజు ప్రభావాన్ని మరింత సంక్లిష్టంగా మార్చాయి. ప్రేమికుల రోజు చరిత్రను, పరిణామాలను, సమాజంపై దాని ప్రభావాన్ని సమగ్రంగా పరిశీలిస్తే, ఇది కేవలం ఒక రోజుకే పరిమితమైన పండుగ కాదని స్పష్టమవుతుంది. ఇది మతపరమైన ఆరంభం నుంచి సాహిత్య ప్రభావం, సామాజిక మార్పులు, ఆర్థిక వాణిజ్యీకరణ వరకు సాగిన దీర్ఘ ప్రయాణం. ప్రేమ అనే భావం శాశ్వతమైనదైనా, దాన్ని వ్యక్తపరచే విధానాలు కాలానుగుణంగా మారాయి. ఆ మార్పులన్నింటికీ ప్రేమికుల రోజు ఒక ప్రతీకగా నిలిచింది.

అసలు ప్రశ్న ప్రేమికుల రోజును ఎలా అర్థం చేసుకోవాలన్నదే. ఇది కేవలం పూలు, బహుమతులు, ఖర్చులతో కూడిన దినంగా మిగిలి పోవాలా, లేక పరస్పర గౌరవం, నిబద్ధత, బాధ్యతతో కూడిన ప్రేమకు గుర్తుగా మారాలా అన్నది సమాజం తీసుకునే దిశపై ఆధారపడి ఉంది.

ప్రేమ ఒక రోజుకు పరిమితం కాదన్న సత్యాన్ని గుర్తుంచుకుంటే, ప్రేమికుల రోజు మనిషిని మరింత మానవీయంగా తీర్చిదిద్దే అవకాశం కలిగిస్తుంది. అప్పుడు మాత్రమే ఈ దినం వాణిజ్య పండుగగా కాకుండా, మానవ విలువలను ప్రతిబింబించే ఒక సామాజిక దినంగా నిలుస్తుంది.

**– రామకిష్టయ్య సంగనభట్ల**

కథ

# ఆవు కోసం



ఒక ఊరిలో రాజయ్య అనే రైతు ఉన్నాడు. అతని దగ్గర ఒక ఆవు ఉన్నది.

ఆవు అంటే రాజయ్య కొడుకు కిరణ్‌కు చాలా ఇష్టం. ప్రతి రోజూ బడికి వెళ్ళే ముందు ఆవుతో మాట్లాడి వెళ్తాడు. బడి నుండి వచ్చిన తర్వాత ఎక్కువ సమయం ఆవు దగ్గరే గడుపుతాడు. ఆవు కూడా కిరణ్ కోసం ఎదురు చూసేది. కిరణ్ బడి నుండి రాగానే ఆవు దగ్గరికి వస్తుంది.


కొన్ని రోజులకు ఆవు ఒక లేగ దూడకు జన్మనిచ్చింది. కిరణ్ రోజూ లేగ దూడను వీధుల్లో తిప్పుతూ ఆడుకునేవాడు. ఆవు ఇచ్చిన పాలను అమ్ముతూ రాజయ్య కొంత డబ్బు సంపాదించాడు. కుటుంబం మొత్తం ఆవును మంచిగా చూసుకునేవారు.

కొన్ని నెలల తర్వాత ఆవు పాలను ఇవ్వడం మానేసింది. దాంతో రాజయ్యకు ఆవు పట్ల విరక్తి కలిగింది. ఆవును అమ్మివేయాలని అనుకున్నాడు. కిరణ్ వద్దని చెప్పాడు.. బతిమాలాడు. అయినా రాజయ్య వినలేదు. ఒకరోజు ఆవును కొనడానికి ఓ వ్యాపారి ఇంటికి వచ్చి ఆవును చూసాడు.

అది చూసి కిరణ్ ఏడ్చాడు. ఆవును అమ్మవద్దని రాజయ్య కాళ్ళు పట్టుకొని బతిమాలాడు. అయినా రాజయ్య వినలేదు. బేరం కుదరక అమ్మకం ఆగిపోయింది. కిరణ్ ఆవు కోసం అన్నం తినడం, బడికి వెళ్ళడం మానేశాడు. రోజూ లేగ దూడను పట్టుకుని ఏడ్వడం మొదలుపెట్టాడు. అమ్మా నాన్న ఎంత చెప్పినా కిరణ్ మంకు పట్టు వీడలేదు. ఏడ్చి ఏడ్చి కిరణ్ అనారోగ్యానికి గురయ్యాడు. కిరణ్‌ను రాజయ్య ఆసుపత్రికి తీసుకెళ్ళి చూపించాడు. కిరణ్ నిద్రలో ఆవు, లేగదూడలను కలవరించేవాడు. రాజయ్యకు పరిస్థితి అర్థమైంది.ఆవును అమ్మనని రాజయ్య కిరణ్‌కు మాట ఇచ్చాడు. కిరణ్ సంతోషించాడు. మెల్ల మెల్లగా కోలుకున్నాడు. కొన్ని నెలల తర్వాత ఆవు మళ్ళీ పాలు ఇవ్వడం మొదలుపెట్టింది. రాజయ్య కుటుంబంలో సంతోషం వెల్లివిరిసింది. కిరణ్‌కు సంపూర్ణ ఆరోగ్యం చేకూరింది.


**పి.అవినాష్,** అనంతసాగర్

## చుక్కలు కలపండి









## బాలగేయం

### కాలం

నువ్వు ఆపలేనిది
నీకై తిరిగి రానిది
ఎంతో విలువైనది
ఇంతని వెల కట్టలేనిది !
ఎవరూ దాచుకోలేనిది
పొదుపుగా వాడుకోవలిసినది!
ఆశలని రేపే
కలల సాకార వారధి
గాయాలని మాన్పే
పరిష్కారాల నిధి!
విలువనిస్తే విలువ పెంచేది
నిర్లక్ష్యానికి మూల్యం కోరేది !
గతాన్ని జ్ఞాపకంగా మార్చేది
వర్తమానంతో
దోబూచిలాడించేది
భవిష్యత్తును
ఊహలకే వదిలేసేది
కనిపించకుండా కళ్ళముందే
కరిగిపోయేది!
అందరికీ సమంగాలభ్యమయ్యేది
ఎవరికి ఎంతో
ముందే తెలియనిది!

**– తిప్పాన హరిరెడ్డి**

**చిన్నారుల ప్రశ్నలకు**
**వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్**
**గిరీష్ అంకుల్ సమాధానాలు**

ఎస్.మాధవన్,
నాయుడుపేట

ప్రశ్న: రంగులను ఎలా గుర్తిస్తారు?

జవాబు: మల్లెపూలు తెల్లగా ఎందుకుంటాయి? మల్లెపూవు అన్ని రంగుల తరంగ దైర్ఘ్యాన్ని తనలో కలిపేసుకుంటుంది కాబట్టి. దాని మీద పడిన కాంతి పరావర్తనం చెంది తెల్లగా ఉన్నట్లు కనపడుతుంది. మరి, మల్లెపూవు తెల్లగా వున్న విషయం మనకెలా తెలుస్తోంది? మన కళ్లు మన మెదడుకు చెబితే అప్పుడు మనకు తెలుస్తున్నది. అయితే, ఈ విషయం చెప్పుకున్నంత సులభమైన ప్రక్రియ కాదు.

మెదడులో జరిగే ఈ ప్రక్రియతో పాటుగా రంగులను గుర్తించడం మీద సంస్కృతి, భాష కూడా ప్రభావం చూపుతాయని శాస్త్రవేత్తలు 2003లో కనుగొన్నారు. పపువా న్యూ గినియాలోని బెర్నిమో అనే ఆదిమ తెగకు చెందిన ప్రజల మీద పరిశోధనలు చేస్తుండగా ఈ విషయం బయటపడింది. వీరికి నీలం రంగుకు పచ్చరంగుకు మధ్య తేడా తెలియదు. అయితే పచ్చరంగులో రెండు రకాల ఛాయలను వీరు గుర్తిస్తారు. పాశ్చాత్య దేశాల్లో ప్రజలు ఈ రంగులను గుర్తించటం కష్టం. ఈ విధంగా పాశ్చాత్య దేశాల్లో ప్రజల మీద కూడా ఇటువంటి ప్రయోగాన్ని చేశారు. వీరు ఈ రంగులను గుర్తించటం పెరిగింది.

పి.అనసూయ, గుంటూరు

ప్రశ్న: ఒలింపిక్ క్రీడా జ్యోతి ఎప్పుడు ప్రారంభమైంది?

జవాబు: 1928లో ఆమ్‌స్టర్‌డామ్‌లో ఒలింపిక్ క్రీడలు నిర్వహించినప్పుడు తొలిసారిగా ఒలింపిక్ క్రీడాజ్యోతిని వెలిగించారు. 1936లో జరిగిన బెర్లిన్ ఒలింపిక్ క్రీడలలో క్రీడాజ్యోతి రిలే ప్రారంభమైంది. అయిదు ఖండాల బంధంగా ఒలింపిక్ క్రీడలు కొనసాగుతున్నాయి.





# కవిత్వం-ప్రకృతి సజీవ తంత్రము

కవిత్వం అనేది మనిషి ఆత్మలోంచి పుట్టే గానమని అంటారు. కానీ అది కేవలం మనిషి హృదయానికే పరిమితం కాదు. ప్రతి జీవం, ప్రతి చెట్టు, ప్రతి జలపాతం, ప్రతి గాలి కదలికలో కవిత్వం దాగి ఉంటుంది. మనసు ఆ ప్రకంపనలను అందుకున్నప్పుడు పదాలు రూపం దాల్చుతాయి. అలా సజీవంగా నిలిచేది కవిత్వం.

నది ఒక నిరంతర ప్రయాణం. పుట్టుక స్థలం నుండి సముద్రం వరకు దాని గమనం ఆగదు. కవిత్వం కూడా అలాగే ఉంటుంది. ఒక చిన్న భావం కవి హృదయంలో మొలకెత్తి, క్రమంగా పెద్ద పద్యరూపం దాల్చుతుంది.



నది మార్గంలో కాంకరాళ్లు, వంకరలు వచ్చినా ఆగకుండా ముందుకు పోతుంది. కవిత్వమూ అలాగే సమాజంలోని అడ్డంకులు, నిరాకరణలు వచ్చినా తన ప్రవాహాన్ని ఆపదు.

ఆకాశం కవిత్వానికి విస్తారమైన వేదిక. నక్షత్రాల కాంతి కవికి కలల వెలుగు ఇస్తుంది. మేఘాల రూపాలు అతనికి ఊహల రంగులు ఇస్తాయి. ఉదయం ఉదయసూర్యుడు ఇచ్చే కాంతి కవిత్వానికి ఆరంభ గీతం అయితే, సాయంత్రపు సంధ్యవేళ ఆ కవిత్వానికి శాంతి గీతమవుతుంది. కవి ఊహలు నింగిలో పక్షుల్లా ఎగురుతూ కొత్త లోకాలను దర్శిస్తాయి. నేల కవిత్వానికి పునాది. నేల వాసనలో మన జ్ఞాపకాలు దాగి ఉంటాయి. వర్షం పడి తడిసిన నేలలోని మట్టి వాసన మన హృదయాన్ని కదిలిస్తుంది. అదే కవికి పద్యం పుట్టే క్షణం. నేలపై నడిచే ప్రతి అడుగు ఒక అనుభవం. ఆ అనుభవాలే కవిత్వానికి బలమైన పదార్థం. పల్లెల పొలాల్లోని మౌన సౌందర్యంగానీ, నగర వీధుల్లోని కకావికలమయిన గందరగోళంగానీ ఇవి అన్నీ నేల మీదే రూపు దిద్దుకున్న జీవన దృశ్యాలు.

నీరు కవిత్వానికి సజీవ శక్తి. జలధార గలగల శబ్దం ఒక గీతంలా వినిపిస్తుంది. వర్షపు చినుకులు కిటికీ తలుపులను తట్టే రీతిలో ఒక లయ ఉంచుతాయి. సముద్రపు అలలు ఉప్పొంగినప్పుడు కవికి హృదయంలోని భావోద్వేగాలు కూడా ఉప్పొంగుతాయి. నీరు ఎలాంటి రూపంలో ఉన్నా జీవనాన్ని నిలబెడుతుంది. అలాగే కవిత్వం ఎలాంటి రూపంలో ఉన్నా మనిషి అంతరంగాన్ని నిలబెడుతుంది.

కవిత్వం అంటే కేవలం పదాలతో రాసిన సాహిత్యం కాదు. అది మనిషి, ప్రకృతి మధ్య ఒక అనుబంధం. నది ప్రవాహం లాగా, ఆకాశం విస్తారంలాగా, నేల బలంలాగా, నీరు సజీవంలా కవిత్వం నిలుస్తుంది. ఈ నాలుగు తత్వాలు కలిసినప్పుడు మాత్రమే కవిత్వం పూర్ణమవుతుంది.

మనిషి జీవితంలోని ప్రతి క్షణానికీ కవిత్వం ఒక ప్రతిబింబం. అది మన ఆత్మలోని కాంతి, మన ఊపిరిలోని రాగం, మన హృదయంలోని తపన. అందుకే కవిత్వం ఎప్పటికీ మరణించదు. అది ప్రకృతితో కలిసి జీవించే శాశ్వత గానమవుతుంది.

– డా. చిటికెన కిరణ్‌కుమార్

## రచనలకు ఆహ్వానం

**రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం. రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జత చేయాలి. ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు దయచేసి పంపించకండి. రచనలు పంపించాల్సిన చిరునామా: ఎడిటర్, ఆదివారం వార్త, నం.396, లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.**

**sunmagvaartha@gmail.com**

# డిజిటల్ శబ్దాల్లో మసకబారుతున్న శతకబోధ

తెలుగు సాహిత్య చరిత్రలో శతకాలు ఒక ప్రత్యేకమైన, విలువైన స్థానం కలిగి ఉన్నాయి. నైతిక బోధ, జీవిత సత్యాల ఆవిష్కరణ, సామాజిక విమర్శ, భక్తి భావం ఇవన్నీ సులభమైన ఛందస్సులో, సామాన్యుడికి చేరువగా చెప్పిన సాహిత్య రూపమే శతక పద్యాలు. వేమన, సుమతి, భాస్కర శతకం, దాశరథి శతకం వంటి రచనలు తరతరాలుగా ప్రజల నోట నానుతూ, వారి ఆలోచనలను తీర్చిదిద్దాయి. అయితే ఆధునిక యుగంలోకి అడుగుపెట్టిన తర్వాత శతక పద్యాలకు ఆదరణ క్రమంగా తగ్గిపోతోందన్న వాస్తవం ఆందోళన కలిగించేది.

డిజిటల్ యుగం మన చదవు అలవాట్లను పూర్తిగా మార్చేసింది. క్షణాల్లో సమాచారం కావాలన్న ఆత్రుత, చిన్న వీడియోలు, రీల్స్, సోషల్ మీడియా పోస్టుల మాయలో పడి మనసు లోతైన పఠనానికి దూరమవుతోంది. శతక పద్యం చదవాలంటే ఓర్పు, ఆలోచన, అంతర్ముఖత అవసరం. కానీ ఆధునిక మనిషి జీవితంలో ఇవన్నీ అరుదైపోయాయి. "త్వరగా చదివి, వెంటనే మరిచిపోవాలి" అన్న ధోరణి పెరుగుతున్నకొద్దీ శతకాల వంటి సాంప్రదాయ సాహిత్యానికి స్థానం తగ్గుతోంది.

విద్యా వ్యవస్థలో వచ్చిన మార్పులు కూడా ఈ పరిస్థితికి కారణమని చెప్పక తప్పదు. ఒకప్పుడు పాఠశాలల్లో శతక పద్యాలు పాఠ్యాంశాలుగా ఉండేవి. విద్యార్థులు వాటిని కంఠస్థం చేసి, వాటి భావాన్ని చర్చించేవారు. నేడు పరీక్షా కేంద్రిత విద్య, మార్కుల పోటీ, ఇంగ్లీష్ మాధ్యమ ప్రాధాన్యం కారణంగా మాతృభాషా సాహిత్యానికి తగిన ప్రాధాన్యం దక్కడం లేదు. ఫలితంగా శతక పద్యాలు యువతకు 'పాతకాలం వాటి'గా మాత్రమే కనిపిస్తున్నాయి.

అదే సమయంలో, ఆధునిక సాహిత్య రూపాలు స్వేచ్ఛా ఛందస్సు కవిత్వం, నవలలు, కథలు ప్రస్తుత




జీవన సమస్యలను నేరుగా ప్రతిబింబిస్తున్నాయన్న భావన బలపడింది. శతకాలు ఎక్కువగా నైతిక బోధ, ఆధ్యాత్మికత చుట్టూ తిరుగుతాయన్న అపోహ కూడా ఉంది. కానీ వాస్తవానికి 'వేమన శతకం' వంటి రచనలు సమాజంలోని మూఢాచారాలను, అసమానతలను తీవ్రంగా ప్రశ్నించాయి. ఈ కోణాన్ని మనం సరిగ్గా ఆవిష్కరించకపోవడమే శతకాల పట్ల ఆసక్తి తగ్గడానికి ఒక కారణం.

మరో ముఖ్యమైన అంశం ప్రచారం లోపించడం. ఆధునిక సాహిత్యానికి వేదికలు, సాహిత్య సమావేశాలు, మీడియా చర్చలు లభిస్తున్నాయి. కానీ శతకాలపై సమకాలీన చర్చలు చాలా అరుదు. టెలివిజన్, డిజిటల్ మాధ్యమాల్లో శతకాలను ఆధునిక సందర్భాలకు అన్వయిస్తూ ప్రజలకు చేరవేయగలిగితే, వాటి విలువ మరింత స్పష్టమవుతుంది. పాతదాన్ని పాతదిగా కాకుండా, నేటి జీవితానికి అర్థవంతంగా చూపించడంలోనే అసలు సవాలు ఉంది.

అయితే తగ్గుతున్న ఈ ఆదరణను పూర్తిగా నిరాశగా చూడాల్సిన అవసరం లేదు. శతక పద్యాల్లో ఉన్న సంక్షిప్తత, గాఢమైన భావం నేటి కాలానికే మరింత అవసరం. ఒకే పద్యంలో జీవన తత్వాన్ని చెప్పగల సామర్థ్యం శతకాలకు ఉంది. ఆధునిక సాంకేతికతను ఉపయోగించి ఆడియో శతకాలు, వీడియో వివరణలు, సోషల్ మీడియా కోట్స్ రూపంలో వాటిని పరిచయం చేస్తే యువతలో ఆసక్తి మళ్లీ చిగురించవచ్చు. విద్యా సంస్థలు కూడా శతకాలను కేవలం పాఠ్యాంశంగా కాకుండా, జీవిత విలువల బోధనగా పరిచయం చేయాల్సిన అవసరం ఉంది.

ముగింపుగా చెప్పాలంటే, ఆధునిక యుగంలో శతక పద్యాలకు తగ్గుతున్న ఆదరణ అనేది కాల ప్రవాహంలో వచ్చిన మార్పుల ప్రతిబింబమే కానీ, శతకాల విలువ తగ్గినట్టు కాదు. వాటిని చదివే విధానం, పరిచయం చేసే తీరులో మార్పు రావాలి.

తెలుగు సాహిత్యానికి పునాది అయిన ఈ శతక సంప్రదాయాన్ని నిర్లక్ష్యం చేయడం అంటే మన సాంస్కృతిక మూలాలను విస్మరించినట్టే. ఆధునికతతో పాటు సంప్రదాయానికి సమతుల్యం సాధించినప్పుడే సాహిత్యం నిజమైన అర్థంలో జీవంతంగా నిలుస్తుంది.

– తిప్పర్తి శ్రీనివాస్

కథ

**రిటైర్మెంట్... ఈ నాలుగు అక్షరాల పదం ఒక మనిషి జీవితాన్ని ఎంతగా మార్చేస్తుందో మోహన్ రావుకు ఇప్పుడు అనుభవంలోకి వస్తోంది. చిత్తూరులోని స్టేట్ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్‌గా, నలభై ఏళ్ల పాటు ఆయన జీవితం గడియారంతో పోటీ పడుతూ సాగింది.**

# రెండో ఇన్నింగ్స్

భూక్యా గోపినాయక్

ఉదయం తొమ్మిదింటి నుండి సాయంత్రం ఆరింటి వరకు ఫైళ్లు, లోన్లు, కస్టమర్లు. ఆ అధికారపు కుర్చీ, ఆ బాధ్యత, ఆ హడావిడి... అవే ఆయనకు ఊపిరి.

ఆరు నెలల క్రితం, ఆ కుర్చీ ఖాళీ అయ్యింది. ఆయన జీవితంలో కూడా ఒక పెద్ద ఖాళీ ఏర్పడింది.

ఇప్పుడు ఆయన రోజు పొద్దున్న ఎనిమిది గంటలకల్లా ముగిసిపోతోంది. పేపర్ చదవడం, కాఫీ తాగడం అవగానే ఏం చేయాలో తోచదు. కొడుకు అమెరికాలో ఉంటున్నాడు. కూతురికి పెళ్లి చేసి పంపించేశారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంటుంది. ఆ నిశ్శబ్దం ఆయనలోని అసహనాన్ని పెంచుతోంది. భార్య శారద తన పని తాను చేసుకుంటుంది. ఇన్నాళ్లూ తన బిజీ ప్రపంచంలో పడి, ఆమె గురించి పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు ఇద్దరూ ఇంట్లోనే ఉంటున్నా, వాళ్ల మధ్య మాటల కన్నా మౌనమే ఎక్కువ రాజ్యమేలుతోంది.

ఒకే ఇంట్లో నివసిస్తున్నా ఇద్దరు అపరిచితుల్లా తయారైంది వాళ్ల పరిస్థితి. ఈ ఖాళీ సమయం ఒక వరంలా కాకుండా, ఒక శిక్షలా అనిపించడం మొదలైంది మోహన్ రావుకు.

................

ఆ రోజు దీపావళి. అమెరికా నుండి కొడుకు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన స్వీట్స్ ప్యాకెట్ వచ్చింది. దాన్ని తెరిచి చూస్తే, రంగు రంగుల కాగితాలలో చుట్టిన ఖరీదైన స్వీట్లు. చూడటానికి చాలా ఆకర్షణీయంగా ఉన్నాయి. కానీ నోట్లో పెట్టుకుంటే, ఏవో రసాయనాల వాసన, చక్కెరపాకం తప్ప అసలు రుచి లేదు.


“దీనికన్నా నేను చేసిన అరిసెలే నయం” అంది శారద, ఆ స్వీట్ రుచి చూసి పెదవి విరుస్తూ.

ఆమె చాలా సాధారణంగా అన్న మాటే, మోహన్ రావు మెదడులో ఒక బల్బును వెలిగించింది. అవును కదా! శారద చేతి వంట అద్భుతంగా ఉంటుంది. ఆమె చేసే అరిసెలు, సున్నుండలు, బూందీ లడ్డూ తిన్న బంధువులందరూ మెచ్చుకుంటారు. ఆ రుచి ఏ బ్రాండెడ్ స్వీట్ షాపులోనూ దొరకదు. ఒక బ్యాంక్ మేనేజర్‌గా ఆయన మెదడు వెంటనే లాభనష్టాల లెక్కలు వేయడం మొదలుపెట్టింది.

“శారదా, మనం ఒక పని చేస్తే ఎలా ఉంటుంది?” అన్నాడు ఆయన ఎంతో ఉత్సాహంగా.

చాలా రోజుల తర్వాత ఆయన గొంతులో అంత ఉత్సాహం కనిపించింది.

“ఏమిటండీ?” అంది ఆమె నిర్లిప్తంగా. “మనం... మనం.. పిండివంటల వ్యాపారం మొదలుపెడదాం. ‘శారదాస్ హోమ్లీ ఫుడ్స్’ అని పేరు పెడదాం. నువ్వు వంటలు చేద్దువు గాని, నేను బిజినెస్ అంతా చూసుకుంటాను. మార్కెటింగ్, అకౌంట్స్, డెలివరీ... అన్నీ నా బాధ్యత”.



ఆ మాటకు శారద ఆశ్చర్యంగా భర్త వైపు చూసింది. "ఏమండీ, మీకు మతిపోయిందా? ఈ వయసులో మనకు వ్యాపారాలు అవసరమా? నేను చేసిన వంటలు మనవాళ్లు మెచ్చుకుంటారు, అంతేగానీ నలుగురూ కొంటారని నమ్మకం ఏంటి?" ఆమె గొంతులో అపనమ్మకం, భయం.

"నాకు నమ్మకం ఉంది.. నీ చేతి మీద, నా మేనేజ్‌మెంట్ మీద. ఇన్నాళ్లూ బ్యాంకులో లక్షల కోట్ల రూపాయల లావాదేవీలు చూశాను. ఈ చిన్న వ్యాపారాన్ని విజయవంతం చేయలేనా? మన పిల్లల మీద ఆధారపడకుండా, మన కాళ్ల మీద మనం నిలబడదాం. మనకు ఒక పని ఉంటుంది, పదిమందికి మన చేతి రుచి తెలుస్తుంది. ఒక్కసారి ఆలోచించు" ఆయన మాటల్లో ఒక కొత్త ఆశ, ఆత్మవిశ్వాసం తొణికిసలాడాయి.

ఆయనలోని ఆ పట్టుదల శారదను కూడా కదిలించింది. భర్త మాటలకు సరేనని తలలూపింది.

ఆ రోజు, ఆ ఇంట్లో ఒక కొత్త ప్రయాణం మొదలైంది. వాళ్ల 'రెండో ఇన్నింగ్స్'కు నాంది పలికింది.

చెప్పినంత సులువుగా ఏదీ జరగలేదు. మోహన్ రావు తన రిటైర్మెంట్ డబ్బులోంచి ఒక లక్ష రూపాయలను పెట్టుబడిగా పెట్టారు. వంటగదిని ఆధునీకరించారు. స్వచ్ఛమైన నెయ్యి, బెల్లం, నూనె కోసం చిత్తూరు చుట్టుపక్కల పల్లెటూళ్లన్నీ తిరిగారు.

శారద ఎంతో శ్రద్ధగా, శుచిగా పిండివంటలు చేయడం మొదలుపెట్టింది. ఆ ఇంటి వంటగది ఇప్పుడు ఒక చిన్న పరిశ్రమలా మారింది. కానీ, వస్తువులు తయారు చేయడం ఒక ఎత్తైతే, వాటిని అమ్మడం మరో పెద్ద సవాలు. మోహన్ రావు, ఒకప్పుడు తన క్యాబిన్‌లో కూర్చుని ఆర్డర్లు వేసే మేనేజర్. మరి ఇప్పుడు.. చేతిలో స్వీట్ ప్యాకెట్ల శాంపిల్స్ పట్టుకుని, పట్టణంలోని కిరాణా షాపుల చుట్టూ, బేకరీల చుట్టూ తిరగడం మొదలు పెట్టారు. చాలామంది ఆయనను చూసి, "ఏంటి సార్, మీరిలా తయారయ్యారు?" అని జాలిగా అడిగారు. కొందరు శాంపిల్స్ తీసుకుని, తర్వాత చూద్దాంలే! అని పంపించేశారు. ఆ తిరస్కరణలు, ఆ జాలి చూపులు ఆయనను బాధపెట్టినా పట్టుదల వీడలేదు.

"ఇలా కాదు శారదా, మనం మార్కెటింగ్ పద్ధతి మార్చాలి" అని ఒక రోజు ఇంటికి వచ్చి, తన కొడుకు సహాయంతో వాట్సాప్, ఫేస్‌బుక్‌లో 'శారదాస్ హోమ్లీ ఫుడ్స్' పేరుతో ఒక పేజీ క్రియేట్ చేశారు. తమ బంధువులను, స్నేహితులను ఆ గ్రూపులో చేర్చారు. వాళ్లు తయారు చేసే పిండివంటల ఫోటోలను రోజూ అందులో పెట్టడం మొదలు పెట్టారు.

నెమ్మదిగా ఆర్డర్లు రావడం మొదలైంది. మొదట తెలిసినవాళ్లు మొహమాటానికి కొన్నారు. కానీ ఒక్కసారి రుచి చూశాక, వాళ్లే పదిమందికి చెప్పారు. మాట ద్వారా ప్రచారం పెరిగింది. మోహన్ రావు, ఆ వయసులో, తనే స్వయంగా స్కూటర్ మీద వెళ్లి డెలివరీలు ఇచ్చేవారు. ఒకప్పుడు కారులో తిరిగిన ఆయన, ఇప్పుడు స్కూటర్ మీద తిరగడం చూసి కొందరు నవ్వుకున్నారు. కానీ ఆయన వాళ్ల నవ్వులను పట్టించుకోలేదు. తన లక్ష్యం మీదనే దృష్టి పెట్టారు.

వాళ్ల వ్యాపారం చిన్నగా పుంజుకుంటున్న సమయంలో ఒక పెద్ద దెబ్బ తగిలింది. ఒక పెళ్లికి అని, వాళ్లకు వంద కిలోల లడ్డూ ఆర్డర్ వచ్చింది. అది వాళ్లకి వచ్చిన అతిపెద్ద ఆర్డర్. రాత్రీ పగలూ కష్టపడి, శారద, మోహన్ రావు ఇద్దరూ ఆ ఆర్డర్‌ను సిద్ధం చేశారు.

కానీ, పెళ్లికి ముందు రోజు, పెళ్లివాళ్లు ఫోన్ చేసి, "క్షమించండి, మాకు వేరే చోట మీ కన్నా తక్కువ ధరకు వచ్చాయి. ఆర్డర్ క్యాన్సిల్ చేసుకుంటున్నాం" అని చెప్పారు.

అంత కష్టపడి చేసిన వంద కిలోల లడ్డూలు మిగిలిపోయాయి. పెట్టుబడి నష్టం. అంతకన్నా ఎక్కువగా, వాళ్ల నమ్మకం మీద పెద్ద దెబ్బ పడింది.

ఆ రోజు శారద కన్నీళ్లు పెట్టుకుంది. "మనకు ఈ వ్యాపారాలు వద్దండీ. మన బతుకేదో మనం బతుకుదాం" అంది నిరాశగా. మోహన్ రావు కూడా ఒక్క క్షణం కుంగిపోయారు. కానీ, బ్యాంకులో ఎన్నో క్లిష్టమైన పరిస్థితులను ఎదుర్కొన్న అనుభవం ఆయనకు ధైర్యాన్నిచ్చింది.

**చెప్పినంత సులువుగా ఏదీ జరగలేదు. మోహన్ రావు తన రిటైర్మెంట్ డబ్బులోంచి ఒక లక్ష రూపాయలను పెట్టుబడిగా పెట్టారు. వంటగదిని ఆధునీకరించారు. స్వచ్ఛమైన నెయ్యి, బెల్లం, నూనె కోసం చిత్తూరు చుట్టుపక్కల పల్లెటూళ్లన్నీ తిరిగారు.**

"ఒక్క ఓటమికే భయపడితే ఎలా శారదా? ఇప్పుడు మనం ఏం చేయాలో నేను చెప్తాను" అని ఆమెను ఓదార్చారు.

వెంటనే, వాళ్ల వాట్సాప్ గ్రూపులో ఒక మెసేజ్ పెట్టారు. "ఒక పెద్ద ఆర్డర్ క్యాన్సిల్ అవ్వడం వల్ల, స్వచ్ఛమైన నెయ్యితో చేసిన వంద కిలోల లడ్డూలు సిద్ధంగా ఉన్నాయి. మార్కెట్ ధర కన్నా సగం ధరకే ఇస్తున్నాం. కావాల్సినవారు వెంటనే సంప్రదించండి."

ఆ మెసేజ్ పెట్టిన గంటలోనే, వాళ్ల ఫోన్ మోగడం మొదలైంది. తెలిసినవాళ్లు, వాళ్ల స్నేహితులు... అందరూ కిలో, రెండు కిలోలు అని ఆర్డర్లు ఇచ్చారు. ఆ సాయంత్రానికల్లా, వంద కిలోల లడ్డూలు అమ్ముడైపోయాయి.

నష్టం రాలేదు, పైగా ఊహించని ప్రచారం వచ్చింది. ఆ సంఘటన తర్వాత, వాళ్ల వ్యాపారం మీద, వాళ్ల మీద వాళ్లకే నమ్మకం రెట్టింపు అయ్యింది.

ఆ తర్వాత వాళ్లు వెనక్కి తిరిగి చూసుకోలేదు. ఒక చిన్న షాపు అద్దెకు తీసుకున్నారు. శారదకు సహాయంగా ఇద్దరు మహిళలను పనిలో పెట్టుకున్నారు.

మోహన్ రావు మార్కెటింగ్ చూసుకుంటుంటే, శారద కిచెన్ సామ్రాజ్యాన్ని ఏలుతోంది. ఒకప్పుడు ఖాళీగా, నిశ్శబ్దంగా ఉండే వాళ్ల ఇల్లు, ఇప్పుడు పనివాళ్ల మాటలతో, పిండివంటల సువాసనతో నిత్యం కళకళలాడుతోంది.

ఏడాది గడిచింది. 'శారదాస్ హోమ్లీ ఫుడ్స్' చిత్తూరులో ఒక నమ్మకమైన బ్రాండ్‌గా మారింది.

ఆ రోజు వాళ్ల పెళ్లి రోజు. షాపు మూసేశాక, ఇద్దరూ ఇంటికి వచ్చారు. "ఏమండీ, ఇవాళ మన పెళ్లి రోజు కదా, బయటకెక్కడైనా భోజనానికి వెళ్దామా?" అంది శారద.

మోహన్ రావు నవ్వి, "ఎందుకు శారదా? ఊరందరికీ రుచులు పంచే దేవతవు నువ్వే నా ఇంట్లో ఉండగా, నేను బయట హోటల్‌కు ఎందుకు వెళ్తాను? నువ్వు చేసిన నాలుగు గారెలు, కొంచెం పాయసం చాలు నాకు" అన్నారు. ఆయన మాటలకు శారద ముఖం సిగ్గుతో ఎర్రబడింది. ఇన్నాళ్లూ తనను కేవలం తన అవసరాలు తీర్చే భార్యగా చూసిన మనిషి కాదు ఆయన. ఇప్పుడు తనలోని ప్రతిభను గుర్తించి, గౌరవిస్తున్న ఒక భాగస్వామి. వాళ్ల మధ్య దూరం, మౌనం కరిగిపోయి, ఎప్పుడో పెళ్లి కొత్తలో ఉన్న ప్రేమ, గౌరవం మళ్లీ చిగురించాయి. భోజనం అయ్యాక, వరండాలో కూర్చుని, వాళ్ల వ్యాపారం గురించి, భవిష్యత్ ప్రణాళికల గురించి మాట్లాడుకుంటున్నారు. వాళ్ల సంభాషణలో ఇప్పుడు పిల్లల గురించిన ఆందోళన లేదు, ఒంటరితనం గురించిన భయం లేదు. ఒక కొత్త ఉత్సాహం, కలిసి ఏదో సాధిస్తున్నామనే తృప్తి ఉన్నాయి.

రిటైర్మెంట్ వాళ్ల జీవితానికి ముగింపు కాదు, ఒక కొత్త ఆరంభాన్ని ఇచ్చింది. ఖాళీ అయిన గూడు, ఇప్పుడు ఒక కొత్త కలల కర్మాగారంగా మారింది. వాళ్ల 'రెండో ఇన్నింగ్స్', మొదటి ఇన్నింగ్స్ కన్నా ఎంతో ఆసక్తికరంగా, అర్థవంతంగా సాగుతోంది. వాళ్లు కేవలం ఒక వ్యాపారాన్ని నిర్మించలేదు, తమ బంధాన్ని, తమ జీవితాలను పునర్నిర్మించుకున్నారు.

# మూడు ముళ్లు

'పోస్ట్' అన్న కేక వినపడేసరికి దిగ్గున లేచింది సుమిత్ర, నాకు, ఉత్తరాలు రాసేవాళ్ళు ఉన్నారు. ఆయన చనిపోయి పదేళ్లవుతోంది. అనుకుంటూ ఉత్తరం అందుకుంది. చదవబోతుండగా ఫోన్ మోగితే ఉత్తరం పక్కన పెట్టేసి 'హలో' అంది. "సమిత్రా, నేను కాంతం" అంది.

"నువ్వేనా ఉత్తరం రాసింది" అంది. "ఉత్తరం ఏమిటే నీ ముఖం నేను చెప్పేది విను" అంది కాంతం. "చెప్పు కాంతమత్తా" అంది, సుమిత్ర.

"నీ విషయమేనే ఎన్నాళ్ళు అలా ఒంటరిగా ఉంటావ్, మా ఊర్లో రామంకు భార్య చనిపోయి ఆరేళ్ల అయింది. వాడికి ఇద్దరు మగపిల్లలు, వాళ్ల విదేశాలలో ఉన్నారు. నీ మాదిరే రామంకు పదేకరాల భూమి ఉంది. అంతా గుత్తకు ఇచ్చేసి టౌన్ చేరు. అపార్ట్‌మెంట్ తీసిస్తా హాయిగా ఉండు" అని పెద్ద కొడుకు చెప్పాడు. "నువ్వు ఎక్కడ వున్నా నాకిష్టమే" అన్నాడు కొడుకు. నీ పిల్లలు ఏమనుకుంటారేమోనని అనుకోకు వాళ్ళు సరేనంటారు. నువ్వు కూడా ఆ పదెకరాలు గుత్తకు ఇచ్చి సరే అను. నీ మేలు కోరి చెబుతున్నా, నీకు ఈ వయసులో నీకు తోడు అవసరం. ఆయనకు కూడా అవసరమే" అంది.

సుమిత్ర ఆలోచనలో పడింది. "ఏమంటావ్?" అంది కాంతం.

కాంతమే అందుకుని "నేను గత వారమే నీ విషయం చెప్పాను. ముందు ఆవిడ ఇష్టం కనుకోవాలి కదా! ఆమెకు ఇష్టం అయితే నాకు ఇష్టమే అన్నాడు. రేపు ఏ విషయం చెప్పు ఈ ఉగాదికే మూడు ముళ్ళు" అని పెట్టేసింది.



ఆలోచనలు ముప్పిరి గొన్నాయి. ఉత్తరం ఎవరిదోనని చదవసాగింది. "సుమిత్రకు, రామం రాయునది. మీకు కాంతమ్మ గారు అంతా చెప్పి ఉంటారు. ఫోన్ ఎందుకని ఉత్తరం రాస్తున్న. మీరు ఒంటరి, నేను అంతే! మీకు ఇష్టం అయితేనే ఫోన్ చేయండి. లేకపోతే లేదు. మిమ్మల్ని బలవంత పెట్టను. మా పిల్లలకు అంతా చెప్పాను. వాళ్ళు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. మీ పిల్లలను కూడా కనుక్కొని వాళ్ళకు ఇష్టం ఉంటేనే నాకు ఫోన్ చేయండి. పిల్లల అభిప్రాయం మనకు ముఖ్యం. మీ పిల్లలు వద్దంటే వద్దు.. అనుకుంటా సరేనా! ఇట్లు రామం అని చదవడం పూర్తి చేసింది. "ఏం చెప్పాలి రామం గారికి, పిల్లలు ఏమనుకుంటారోనని పెద్ద కొడుకుకు ఫోన్ చేసింది. "హలో అమ్మ" అన్నాడు. విషయం చెప్పేసరికి "చాలా సంతోషం, ఒకే" అను అని పెట్టేశాడు. చిన్న కొడుకుకు ఫోన్ చేస్తే "రియల్లీ" అని ఎగిరి గంతేశాడు."చాలా రోజులకు నీ నుండి శుభవార్త వింటున్నానమ్మా. నీకు నలభై ఆరు ఏళ్ళు, అతనికి యాభై ఉంటాయా, సరే అనమ్మా. అన్నట్లు మీ పెళ్ళికి నేను, అన్నయ్య రాకపోవచ్చు. మీ పెళ్లి ఫొటోలు పంపండి" అన్నాడు. సుమిత్రకు బరువు తీరింది. కొడుకులు సరేనన్నారు. ఇంకా ఉగాదికి మూడు నెలల సమయముంది అనుకుంటూ రామంకు ఫోన్ చేసింది.

"సరే సుమిత్రా! మన పెళ్ళికి కాంతమ్మ గారే పెద్ద. ఈ ఉగాదికే పెళ్లి" అన్నాడు. ఓ మంచి రోజు చూసి కాంతం, సుమిత్ర ఊరు వెళ్ళింది.

"ఈ ఉగాదికి నీకు మూడు ముళ్ళు పడితే అదే చాలు నాకు. ఇద్దరూ టౌన్‌లో కాపురం పెడితే అంతకంటే కావాల్సింది ఏముంది?" అంది సుమిత్రతో. రామంతో పెళ్లి ఊహించుకుని కలల్లో తేలిపోయింది సుమిత్ర.

– కనుమ ఎల్లారెడ్డి

# ఉద్యమ శిల్పి ఎమ్.వి.రమణారెడ్డి జీవనరేఖలు

ప్రపంచ మహానగరి, తెలంగాణ ప్రజా సౌభాగ్య రాజధాని, శతాబ్దాల నాటి సంస్కృతి, కళా వైభవానికి దీటుగా సచివాలయ సమీపంలో తెలంగాణ అమరవీరుల స్మృతికి ప్రతీకగా అండాకారపు దివ్వె, ఎన్నటికీ ఆరని ఉద్యమ ఉజ్వల జ్వాలగా అజరామరమైన శిల్ప కళాఖండానికి జీవం పోసిన ఉద్యమ శిల్పి ఎమ్.వి.రమణారెడ్డి అంతర్జాతీయ కళామేధావి ఎమ్.వి., ప్రపంచ గ్యాలరీలలో, పేపర్‌గుజ్జు, టెర్రకోట, సిరామిక్, ఫైబర్ గ్లాస్, పెయింటింగ్, చెక్క, రాగి, సిమెంట్, స్టెయిన్‌లెస్ స్టీల్, వాటర్, ఆయిల్ కలర్స్, ఇన్‌స్టలేషన్, మ్యూరల్స్ ఏ మీడియం అయినా ఆత్మ సౌందర్యాన్ని అవలోకింపచేసే సృనాత్మక అద్భుత రూపశిల్పి. జర్మనీలో ఉల్మ్‌లో రైల్వేస్టేషన్‌లో ఇన్‌స్టలేషన్ ఒక నెల చేసిన విశ్వ శిల్పదార్శనికులు తెలంగాణ వాసి కావటం యావద్భారత ప్రజకు గర్వకారణం. ప్రత్యేక రాష్ట్ర సాధనా ఉద్యమ పోరాటంలో శిల్పకళ ఆయుధంగా, ఉత్తేజింపచేసిన ఉద్యమ శిల్పిగా ఎమ్.వి.రమణారెడ్డి నూతన తెలంగాణ తల్లి, రాజీవ్‌గాంధీ, సినారె స్మారక రూపకల్పన, అమరవీరుల స్మృతివనం.. ఇలా ఎన్నో ఎన్నెన్నో ఫైలాన్‌లు, మ్యూరల్స్, లోగోలు, విగ్రహాలు రూపొందింపచేసిన విలక్షణ కళా, సృజనాత్మక స్రష్టగా ప్రపంచం ప్రశంసిస్తోంది. అపూర్వ, అనిర్వచనీయ శిల్పకళా ప్రతిభను, ప్రతీకలను దర్శింపచేస్తున్న ఉద్యమశిల్పి ఎమ్.వి.రమణారెడ్డి ప్రస్తుత జీవన రేఖల మహోద్గ్రంథంగా పర్యాటక, సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వ సౌజన్యంతో ఈ కళా స్వరూప శిల్పి జీవన ఉజ్వలతను ఈ గ్రంథం దర్శింపచేస్తోంది. ప్రముఖ పాత్రికేయులు పున్నా కృష్ణమూర్తి రచయితగా, 19 అధ్యాయాలుగా రూపొందించబడిన, ఉద్యమ శిల్పి ఎమ్.వి.ఆర్, జీవన ప్రస్థానం నేటికీ సాధిస్తున్న విజయాలు, నవ తెలంగాణ రాష్ట్ర ఉజ్వల అస్తిత్వ మహోదయ తేజోదీప్తి ఆవిష్కరిస్తోంది.



**(ఉద్యమశిల్పి-రచన: పున్నా కృష్ణమూర్తి)**


**- యర్రమిల్లి**

---

## పుస్తక సమీక్ష

# పన్ను విధానాన్ని సమాజపు అద్దంలో చూసిన జిఎస్‌టి గ్రంథం

జిఎస్‌టిపై వచ్చిన చాలా రచనలు చట్టసవరణలు, రేట్ల మార్పులు, రిటర్న్ ప్రక్రియల చుట్టూ పరిమితమవుతాయి. అయితే ఈ గ్రంథం ఆ పరిధిని దాటి, పన్ను సంస్కరణలు ప్రజల దైనందిన ఖర్చులపై, వినియోగ సరకులపై, చిన్న, మధ్యతరహా వ్యాపారాల స్థిరత్వంపై ఎలా ప్రభావం చూపాయో పరిశీలిస్తుంది. ఈ గ్రంథానికి ప్రధాన బలం జిఎస్‌టి అమలుకు ముందు, తరువాత పరిస్థితుల తులనాత్మక విశ్లేషణ. ఈ గ్రంథం త్రిభాషా రూపంలో వెలువడటం మరో విశేషం. పన్ను విధానాలపై అవగాహన ప్రజల్లోకి చేరాలన్న ఉద్దేశం ఇందులో స్పష్టంగా కనిపిస్తుంది. మోదీ ప్రభుత్వ విధానాలను వ్యక్తిపూజగా కాకుండా, వాటి ఫలితాల ఆధారంగా విశ్లేషించడం ఇందులో కనిపిస్తుంది. ప్రశంస, విమర్శ రెండూ సంయమనంతో, ఆధారాలతోనే వస్తాయి. జిఎస్‌టి అనేది కేవలం ప్రభుత్వ ఆదాయ సాధనం మాత్రమే కాదు. అది ప్రజల జీవన వ్యయం, వ్యాపారాల నిలకడ, సమాజ సమతుల్యతను ప్రభావితం చేసే వ్యవస్థ. ఆ వాస్తవాన్ని శాంతంగా, గంభీరంగా, విశ్లేషణాత్మకంగా చెప్పిన గ్రంథం ఇది. పన్ను విధానాలపై ఆసక్తి ఉన్నవారికే కాదు.. దేశ ఆర్థిక నిర్ణయాలు సమాజాన్ని ఎలా మలుస్తున్నాయో తెలుసుకోవాలనుకునే ప్రతి పాఠకుడికి ఈ గ్రంథం ఉపయుక్తం.



**(సామాజిక న్యాయం-ఆర్థిక సమానత్వం-అభివృద్ధి దిశగా జీఎస్టీ-రచన: డా.వకుళాభరణం కృష్ణమోహన్ రావు; వెల:రూ.250/-; ప్రతులకు: శ్రీమతి వకుళారణం సుధశ్రీ, బి బ్లాక్, ఫ్లాట్ 505, వైష్ణవి లక్ష్మి విల్లా, నల్లకుంట, హైదరాబాద్-500 044))**

---

## అందాయి



**ప్రకాశ కిరణాలు (సంపాదకీయ వ్యాసాలు)**
పొత్తూరి సుబ్బారావు
ప్రతులకు:
సాహితి కిరణం
11-13-154, అలకాపురి,
రోడ్ నం.3,
హైదరాబాద్-500 102;
ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

**ఢంకా ధ్యానం(లఘు కవిత్వం)**
రచన: ఎస్.ఆర్.పృథ్వి
ప్రతులకు: శ్రీమతి పి.ఉషారాణి
104-6-140, ఎమ్.జి.స్ట్రీట్
రామక్రిష్ణా నగర్,
రాజమహేంద్రవరం-533 101
ఆంధ్రప్రదేశ్.

**రఘుశ్రీ హైకూలు**
రచన: ఉమ్మడిసింగు రాఘవరావు
ప్రతులకు:
అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు

**కాలపు చరిత్రలో అడుగులు**
**చారిత్ర దృక్కోణంలో యూరోప్ యాత్ర**
రచన: విజయా రంగనాథం
ప్రతులకు: విజయా రంగనాథం,
ప్రియా కాలనీ, ఫేజ్-2, కాకాగూడ,
కార్ఖాన, సికిందరాబాద్-15

అంతరిక్షం గురించి కనీస అవగాహన ఉన్న ప్రతి ఒక్కరికీ సునీతా విలియమ్స్ పేరు అత్యంత సుపరిచితమైన పేరు. కొలంబియా దుర్ఘటనలో మరణించిన భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామి కల్పనా చావ్లా తర్వాత,

# అంతర్జాతీయ ఖ్యాతి గడించిన వ్యోమగామి

# సునీతా విలియమ్స్

అంతరిక్షంలోకి వెళ్ళిన భారతీయ సంతతికి చెందిన రెండవ అమెరికన్ వ్యోమగామి ఆమె. అమెరికన్ వ్యోమగామి అయిన సునీతా విలియమ్స్ మాజీ అమెరికన్ నేవీ పైలట్. ఆమె అత్యంత అనుభవజ్ఞులైన స్పేస్‌వాకర్లలో ఒకరు.

## యుఎస్ నేవీలో సునీతా విలియమ్స్

సునీతా విలియమ్స్ విశ్రాంత యుఎస్ నేవీ కెప్టెన్, నిష్ణాతులైన నేవల్ ఏవియేటర్. ఆమె 1987 నుండి 2017 వరకు రెండు దశాబ్దాల పాటు యుఎస్ నేవీకి సేవలందించారు. 1983లో సునీతా విలియమ్స్ మేరీల్యాండ్‌లోని అన్నాపోలిస్‌లోని యుఎస్ నేవల్ అకాడమీలో చేరగా, 1987లో ఆమెను ఎన్‌సైన్‌గా ఎంపిక చేసి నేవల్ ఏవియేషన్ ట్రైనింగ్ కమాండ్‌లో ఏవియేటర్ శిక్షణ కోసం పంపించారు. జులై 1989లో శిక్షణ అనంతరం, ఆమె యుద్ధ హెలికాప్టర్ పైలట్ అయ్యారు. హెచ్46 సీ నైట్స్‌లో ప్రత్యేకత కలిగిన ఆమె ఆపరేషన్స్ డెజర్ట్ షీల్డ్, ప్రొవైడ్ కంఫర్ట్ సమయంలో మిషన్లను నిర్వహించారు. పర్షియన్ గల్ఫ్ యుద్ధ సన్నాహాల సమయంలో, ఇరాక్‌లోని కుర్దిష్ ప్రాంతాలపై నిషేధ గగనతలం (నోఫ్లై జోన్‌ల) ఏర్పాటు సమయంలో, అలాగే 1992లో మయామిలో హరికేన్ ఆండ్రూ సమయంలో సహాయక మిషన్లలో ఆమె హెలికాప్టర్ సహాయక స్క్వాడ్రన్‌లలో విధులు నిర్వహించారు. 1993లో నావికాదళ టెస్ట్ పైలట్‌గా పట్టభద్రురాలైన ఆమె ఆ తర్వాత టెస్ట్ పైలట్ బోధకురాలిగా పనిచేశారు. నాసాలో చేరడానికి పూర్వమే ఆమె 30కి పైగా విభిన్న రకాల విమానాలను నడిపి, 3,000 గంటలకు పైగా విమానయాన అనుభవాన్ని పొందారు. అంతరిక్ష కార్యక్రమానికి వ్యోమగామిగా ఎంపికైన సమయంలో ఆమె యు.ఎస్.ఎస్. సైపాన్ నౌకలో విధులు నిర్వహించేవారు.



**నాసాలో ప్రస్థానం:** సునీతా విలియమ్స్ 1995లో మెల్‌బోర్న్‌లోని ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్ పూర్తి చేసి, 1998లో వ్యోమగామి శిక్షణలో చేరారు. ఆస్ట్రోనాట్ క్యాండిడేట్ శిక్షణలో ఆమె ఓరియంటేషన్ బ్రీఫింగ్‌లు, టూర్లు, అనేక శాస్త్రీయ, సాంకేతిక బ్రీఫింగ్‌లు, షటిల్, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం వ్యవస్థలలో ఇంటెన్సివ్ ఇన్‌స్ట్రక్షన్, టి38 విమాన శిక్షణకు సిద్ధం కావడానికి ఫిజియోలాజికల్ శిక్షణ, గ్రౌండ్ స్కూల్, అలాగే నీరు, అరణ్య మనుగడ పద్ధతులను నేర్చుకున్నారు. శిక్షణ, మూల్యాంకనం తర్వాత, విలియమ్స్ మాస్కోలో రష్యన్ స్పేస్ ఏజెన్సీతో కలిసి అంతరిక్ష కేంద్రానికి రష్యా సహకారం, మొదటి ఎక్స్‌పెడిషన్ క్రూతో కలిసి పనిచేశారు. అక్కడ ఆమె ఐఎస్ఎస్ యాత్రలకు సిద్ధమవుతున్న సిబ్బందితో కలిసి పనిచేస్తూ రోబోటిక్స్, ఇతర ఐఎస్ఎస్ కార్యాచరణ సాంకేతికతలలో శిక్షణ పొందారు. ఎక్స్‌పెడిషన్1 నుండి తిరిగి వచ్చిన తర్వాత,

మొదటి అంతరిక్షయానం తర్వాత, ఆమె ఆస్ట్రోనాట్ ఆఫీస్ డిప్యూటీ చీఫ్‌గా పనిచేశారు. డిసెంబర్ 9, 2006న, ఆమె ఐఎస్ఎస్‌కు వెళ్ళే ఎస్టిఎస్116 మిషన్‌లో భాగంగా డిస్కవరీ అంతరిక్ష నౌకలో ప్రయాణించారు. అక్కడ ఆమె ఎక్స్‌పెడిషన్స్ 14, 15కి ఫ్లైట్ ఇంజనీర్‌గా పనిచేశారు. ఆమె తిరిగి జూన్ 22, 2007న ఎస్టిఎస్117 సిబ్బందితో కలిసి కాలిఫోర్నియాలోని ఎడ్వర్డ్స్ వైమానిక స్థావరం వద్ద భూమిపైకి చేరుకున్నారు. అంతరిక్ష కేంద్రంలో ఉన్న సమయంలో, ఆమె నాలుగు పర్యాయాలు అంతరిక్ష నౌక వెలుపల మొత్తం 29 గంటలకు పైగా నడవడంతో పాటు అంతరిక్షంలో మొత్తం 195 రోజులు గడిపారు. ఈ రెండు కూడా అంతరిక్షంలో మహిళలు నెలకొల్పిన రికార్డులు. ఈ చివరి రికార్డును ఆమె 2015 వరకు కలిగి ఉన్నప్పటికీ, ఆ తర్వాత ఇటాలియన్ మహిళా వ్యోమగామి సమంతా క్రిస్టోఫోరెట్టి 199 రోజులకు పైగా అంతరిక్షంలో గడిపారు. ఆమె తిరిగి జులై 15, 2012న సోయుజ్ టిఎంఏ05ఎం సిబ్బందిలో భాగంగా మళ్లీ ఐఎస్ఎస్‌కు ప్రయాణించారు.

ఎక్స్‌పెడిషన్ 32లో ఫ్లైట్ ఇంజినీర్‌గా విధులు నిర్వహించిన ఆమె, సెప్టెంబర్ 17న ఎక్స్‌పెడిషన్ 33 యొక్క కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించి ఆ గౌరవం దక్కించుకున్న రెండవ మహిళ అయ్యారు. ఆ సమయంలోనే ఆమె దక్షిణ కాలిఫోర్నియాలో జరిగిన నాటికా మాలిబు ట్రయాథ్లాన్‌తో సమాంతరంగా అంతరిక్షంలో ట్రయాథ్లాన్ చేసిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. ఇందుకుగాను ఆమె అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోని ట్రెడ్‌మిల్, స్టేషనరీ బైక్‌ను ఉపయోగించారు. రేసులో భాగమైన ఈత కోసం, ఆమె అధునాతన రెసిస్టివ్ ఎక్సర్‌సైజ్ డివైస్ (ARED)ను ఉపయోగించారు.

జులై 2015లో, అమెరికా వాణిజ్య అంతరిక్ష యాత్రల కోసం ఎంపికైన తొలి వ్యోమగాములలో ఒకరిగా నాసా సునీతా విలియమ్స్ పేరును ప్రకటించింది. ఎంపికైన ఇతర వ్యోమగాములతో పాటు బోయింగ్, ఎలాన్ మస్క్ స్పేస్ఎక్స్ సంస్థల వాణిజ్య సిబ్బంది వాహనాలలో ఆమె శిక్షణ పొందారు. జూన్ 5, 2024న బారీ విల్మోర్ కమాండర్‌గా, సునీతా విలియమ్స్ పైలట్‌గా నాసా స్టార్‌లైనర్ సిఎఫ్టి100ను ప్రయోగించింది. ఈ మిషన్‌లో పైలట్‌గా విధులు నిర్వహించిన సునీతా విలియమ్స్, సిబ్బందితో ప్రయోగించిన ఒక అంతరిక్ష నౌక మొదటి మహిళా పైలట్‌గా నిలిచింది. ఈ మిషన్ ఎనిమిది రోజులలో పూర్తి కావాల్సి నప్పటికీ, బోయింగ్ స్టార్‌లైనర్ సర్వీస్ మాడ్యూల్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యల కారణంగా నాసా విలియమ్స్, విల్మోర్‌లను తొమ్మిది నెలలకు పైగా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలోనే ఉంచింది. ఎన్నో వ్యయప్రయాసల అనంతరం, మార్చి 18,2025న ఇద్దరు నాసా వ్యోమగాములు బుచ్ విల్మోర్, సునీతా విలియమ్స్‌లు స్పేస్ఎక్స్ క్రూ9లో తిరిగి భూమికి చేరుకున్నారు. జూన్ 5, 2024 నాటి ప్రయోగంతో అంతరిక్షం చేరుకొని 286 రోజుల పాటు ఐఎస్ఎస్‌లో గడిపి మార్చి 18,2025న భూమికి చేరుకున్న సునీతా విలియమ్స్ అంతరిక్షంలో మొత్తం 608 రోజులు గడిపి అంతరిక్షంలో అత్యధిక రోజులు గడిపిన రెండవ వ్యక్తిగానే కాక మొత్తం 62 గంటల ఆరు నిమిషాల పాటు తొమ్మిది స్పేస్‌వాక్‌లు పూర్తి చేసిన మొట్టమొదటి మహిళగా చరిత్ర సృష్టించారు. అంతేకాదు, 2007లో అంతరిక్షంలో మారథాన్ పరుగు పూర్తి చేసిన మొదటి వ్యక్తిగా, 2012 అంతరిక్షంలో ట్రయాథ్లాన్ పూర్తి చేసిన మొదటి వ్యక్తిగా కూడా ఆమె రికార్డు సృష్టించారు. సునీతాకు పూర్వం వ్యోమగామి పెగ్గీ విట్సన్ అంతరిక్షంలో అత్యధికంగా 675 రోజులు గడిపిన వ్యక్తిగా మొదటి స్థానంలో ఉన్నారు.



## పరిశోధనలు

సునీతా విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తన మిషన్ల సమయంలో మానవ ఆరోగ్యం, వృక్షశాస్త్రం, సూక్ష్మ గురుత్వాకర్షణలో సాంకేతిక అభివృద్ధిపై దృష్టి సారించి విస్తృతమైన, బహుళ-విభాగ పరిశోధనలు నిర్వహించారు. ఆమె పరిశోధనలు భవిష్యత్తులో, దీర్ఘకాలిక అంతరిక్ష అన్వేషణ కోసం సాంకేతికతను అభివృద్ధి చేసేందుకు ఎంతగానో దోహదపడతాయి.

## వ్యక్తిగత నేపథ్యం

సునీతా విలియమ్స్ సెప్టెంబర్ 19, 1965న అమెరికా ఒహాయో రాష్ట్రంలోని యూక్లిడ్‌లో జన్మించారు. భారతీయ స్లోవేనియన్ సంతతికి చెందిన ఆమె మసాచుసెట్స్‌లోని నీధామ్‌లో పెరిగింది. అందువల్ల, ఆమె తన భారతీయ వారసత్వంతో లోతైన సంబంధాన్ని కొనసాగిస్తూనే అమెరికన్ జాతీయతను కలిగి ఉంది. స్లోవేనియన్ అమెరికన్ ఉర్సులిన్ బోనీ పాండ్యా, భారతీయ గుజరాతీ అయిన డాక్టర్ దీపక్ పాండ్యా ఆమె తల్లిదండ్రులు. హిందూ మతాన్ని ఆచరించే ఆమె తన అంతరిక్షయాన సమయంలో భగవద్గీత, ఉపనిషత్తులను తీసుకువెళతుంది. ఆమెకు ఈత, పరుగు, సైక్లింగ్, ట్రయాథ్లాన్‌లు, విండ్‌సర్ఫింగ్, స్నోబోర్డింగ్, హైకింగ్ అంటే అమితాసక్తి. 1983లో నీధమ్ హై స్కూల్ నుండి పట్టభద్రురాలైన ఆమె, 1987లో యు.ఎస్. నేవల్ అకాడమీ నుండి ఫిజికల్ సైన్స్‌లో బిఎస్, 1995లో ఫ్లోరిడా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ నుండి ఇంజనీరింగ్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్ డిగ్రీలను పొందారు.

1987లో నేవీ ఎన్‌సైన్‌గా నియమితురాలైన ఆమె, 1989లో నేవల్ ఏవియేటర్‌గా మారి, డెసర్ట్ షీల్డ్ వంటి ఆపరేషన్లలో హెలికాప్టర్లను నడిపింది. రెండు దశాబ్దాల అనంతరం, 2017లో ఆమె యుఎస్ నేవీ నుండి పదవీ విరమణ చేసిన తర్వాత 1998లో వ్యోమగామి అభ్యర్థిగా ఎంపికైంది. తన గురించి తెలిసిన ప్రతి ఒక్కరికీ, తనకు అంతరిక్షం అత్యంత ఇష్టమైన ప్రదేశం అని తెలుసని విలియమ్స్ ఒక ప్రకటనలో అన్నారు. వ్యోమగాముల కార్యాలయంలో పనిచేయడం, మూడుసార్లు అంతరిక్షంలోకి వెళ్లే అవకాశం లభించడం తనకు లభించిన అద్భుతమైన గౌరవం అని, నాసాలో తన 27 సంవత్సరాల అద్భుతమైన కెరీర్‌లో సహోద్యోగుల నుండి లభించిన అద్భుతమైన ప్రేమ మద్దతు నిరుపమానమైనదని ఆమె అన్నారు.

**అవార్డులు:** యుఎస్ నేవీలో అందించిన సేవలకు గాను సునీతా విలియమ్స్ డిఫెన్స్ సుపీరియర్ సర్వీస్ మెడల్, లెజియన్ ఆఫ్ మెరిట్, నేవీ కమెండేషన్ మెడల్స్‌తో సహా పలు ఇతర అలంకరణలను సంపాదించారు. భారత సంతతికి చెందిన అమెరికన్ వ్యోమగామిగా సునీతా విలియమ్స్ చేసిన అమూల్యమైన కృషికి గుర్తింపుగా, 2008లో భారత ప్రభుత్వం ఆమెను దేశ అత్యున్నత పౌర పురస్కారాలలో ఒకటైన 'పద్మభూషణ్'తో సత్కరించింది.

నాసాలో దాదాపు తన మూడు దశాబ్దాల ప్రస్థానంలో, శాస్త్రవేత్తలు అంతరిక్షం గురించి మరింత లోతుగా తెలుసుకోవడానికి దోహదం చేసే అనేక ప్రయోగాలను నిర్వహించారు. సునీతా విలియమ్స్ అంతరిక్ష శాస్త్రానికి గణనీయమైన కృషి చేసింది. 27 సంవత్సరాల పాటు వ్యోమగామిగా సుదీర్ఘ సునీతా విలియమ్స్ డిసెంబర్ 2025లో నాసా నుండి పదవీ విరమణ పొందారు.

– యేచన్ చంద్రశేఖర్

వాస్తువార్త

వాస్తు విద్వాన్ సాయిశ్రీ

డా॥ దంతూరి పండరినాథ్

సెల్: 9885446501/9885449458




# వాస్తు దోషాలున్నాయా?

**కె.కె, పాలకుర్తి**

**ప్రశ్న: నాలుగు అంతస్తుల అపార్ట్‌మెంట్‌లో మాది సొంత ఫ్లాట్. ఈ ఫ్లాట్ ప్లానులో ఏమైనా వాస్తురీత్యా దోషాలు ఉన్నాయా? ఉత్తర సింహద్వారం నాకు కలిసివస్తుందా? ఈ ఫ్లాట్ మా పిత్రార్జితం, నా వాటాలో వచ్చింది.**

**జవాబు:** 'గరిమెళ్ళ' వారికి దక్షిణ సింహద్వార/దక్షిణ ఆగ్నేయ సింహ ద్వార యోగముంటుంది. మీది దక్షిణ సింహద్వారం. గరిమెళ్ల వారిగా మీరు వ్యవహరింపబడితే దక్షిణ సింహద్వార యోగం అద్భుతంగా ఉంటుంది. ఆగ్నేయం వంటగది, నైరుతి, వాయువ్యంలో పడక గదులు వాస్తు ప్రకారం మంచివే! కానీ యజమానికున్న నైరుతి పడకగదికి నైరుతి మూలన బాత్‌రూమ్ శుభకరం కాదు. అలాగే కుబేర స్థానమైన ఉత్తర దిక్కులో మీకొక బాత్‌రూమ్ ఉన్నది. ఈ రెండు దోషాల వలన ఆరోగ్య, ఆర్థిక ఇబ్బందులు వచ్చే అవకాశాలెక్కువ. వీలైనంత వరకు ఈ దోషాలను సవరించుకుంటే మంచి ఫలితాలను సులభంగా పొందవచ్చు.



## కుబ్జద్వార దోషం అంటే?

**సి.మోహన్, గుంటూరు**

**జవాబు:** కుబ్జద్వార దోషం (నిర్వంశమునకు నాంది..)

గృహం ప్రధాన ద్వారం, ఇతర ద్వారాలు ఆ గృహ వైభవానికి తగిన ప్రమాణం కంటే తక్కువ ప్రమాణంలో ఉన్నట్లయితే ఆ గృహం 'కుబ్జవేధా దోషం' కలిగి ఉంటుంది. ఇలాంటి దోషం కలిగిన గృహంలో ఉండేవారు వంశహీనతను పొందే అవకాశం ఉంటుందని శాస్త్ర వచనం. సంతానం కలగకపోవటం, సంతాన నష్టం కలగటం, వంశాంకురం లేకపోవటం, వంశం అంతరించిపోతున్నదేమోననే భయాందోళనలు కలగడం మొదలైన తీవ్ర సందేహాలు కలిగినప్పుడు ఆ ఇంటి తలుపుల (ఆ ఇంట్లో వుండేవారు కుబ్జవేధా దోషంతో బాధింపబడుతున్నారేమోనని) ప్రమాణాలను ఒక్కసారి సరిచూసుకోవటం మంచిది.

ఒకవేళ ఆ ఇంటి ద్వారాలు ఉండవలసిన ప్రమాణం కంటే (పొడవు, వెడల్పు, మందం) తక్కువగా ఉన్నట్లయితే వాటిని తీసివేసి సరైన పరిమాణంలో, కొత్త తలుపులను, ముహూర్తం చూసుకుని ప్రతిష్ఠించుకున్నట్లయితే మంచి ఫలితాలను తప్పకుండా పొందవచ్చు. కుబ్జద్వారా దోషం నిర్వంశం కలుగజేస్తే దానిని సరిచేసుకోవటం వంశోద్ధరణకు నాందిగా చెప్పుకోవచ్చు.

## పాత ఇంటి కలప వాడవచ్చా?

**ఎన్.రావు, దేవరకొండ**

**ప్రశ్న: మాది చాలా పాత ఇల్లు. ఈ ఇంటిని పూర్తిగా తీసివేసి నూతన గృహ నిర్మించాలని అనుకుంటున్నాం. ఈ ఇంటి దూలాలు ఎంతో దృఢంగా, చాలా పొడవుగా వున్నాయి. గట్టి చెక్కతో చేసిన దూలాలవి. మా ప్రాంతంలో చాలా ఇండ్లు ఇలాగే ఉంటాయి.**

**కొత్త ఇంటికి తలుపులు, కిటికీలు, ఫర్నిచరు, కప్‌బోర్డులకు మొదలైనవి చేయడానికి ఈ కలపను ఉపయోగించవచ్చా?**

**జవాబు:** పాత భవనాలకు చాలా వాటికి ఉపయోగించిన కలప భారీగా ఉండటం నేను గమనించాను. అటు వంటి కలపను తిరిగి వాడాలని అనుకుంటే ఫర్నిచర్, కప్‌బోర్డులు చేయటానికి వాడవచ్చు. నూతన గృహ ప్రధాన ద్వారానికి, కిటికీలకు, ద్వార బంధాలకు తప్పనిసరిగా కొత్త కలపనే వాడాల్సి ఉంటుంది.

వాస్తు విద్వాన్ **డా॥ దంతూరి పండరినాథ్** పాఠకుల సమస్యలకు ఆదివారం 'వాస్తువార్త'లో సమాధానాలిస్తారు. ఈ కింది కూపన్ జతచేసి సమస్యలు పంపవలసిన చిరునామా:
**సాయిశ్రీ వాస్తు కన్సల్టెన్సీ, 3-2-4, కింగ్స్‌వే, రాష్ట్రపతి రోడ్, సికిందరాబాద్-3**

వాస్తువార్త

పూర్తి పేరు : ............................................

పుట్టిన తేది : ............................................

జన్మ నక్షత్రం: ................తల్లి పేరు: ................

చిరునామా:..................................................

– ఒక దేశం కీర్తి ప్రతిష్ఠలు ప్రధానంగా ఆ దేశ రచయితలపై ఆధారపడి ఉంటాయి. – శామ్యూల్ జాన్సన్

# అల్లం 'టీ' తో ప్రయోజనాలెన్నో!

ఆయుర్వేద ప్రకారం అల్లంలో మన శరీరానికి ఉపయోగపడే ఎన్నో అద్భుతమైన ఔషధ గుణాలు ఉంటాయి. అల్లంతో కూరలకు చక్కని రుచి వస్తుంది. రుచికే కాదు, ఆరోగ్యకరమైన ప్రయోజనాలను అందివ్వడంలోనూ ఇది ఉపయోగపడుతుంది. ఈ క్రమంలోనే అల్లంతో టీ తయారు చేసుకుని నిత్యం తాగితే ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి.

తేయాకుని నీటిలో మరిగించగా వచ్చే ద్రావకాన్నే టీ అంటారు. మానవ దేహానికి ఉత్తేజాన్ని కలిగించే ఆహార పదార్థాలలో టీ ప్రథమ స్థానంలో ఉంటుంది. ఇందులో పాలు. చక్కెర కలుపుకొని తాగుతారు. నిద్ర లేచింది మొదలు నిద్ర పోయేవరకు మనిషి జీవితంలో టీ పాత్ర అమోఘమైనది. నిస్సత్తువగా ఉన్నా, ఉల్లాసంగా ఉన్నా టీ తాగడానికి అత్యంత ఉత్సాహాన్ని చూపడం జీవితంలో ఓ అంతర్భాగమైపోయింది. సగటు భారతీయుల్లో దాదాపు సగం మందికిపైగా టీ సేవిస్తున్నారు. మూడు దశాబ్దాల క్రితం మానసిక విశ్రాంతి కోసం కాఫీ సేవించడం అలవాటుగా ఉండేది. ఇళ్ళలో కూడా కాఫీ మాత్రమే వాడుకలో ఉండేది. ఫిల్టర్ కాఫీ బాగా వాడుకలో ఉన్న రోజుల్లో ఇన్‌స్టంట్ కాఫీలు రావడం, వాటితో పాటు పలు రకాల టీ పొడర్లు మార్కెట్‌లోకి విడుదల కావడం, 'టీ'కి జనసామాన్యంలో అధిక వినియోగం ఏర్పడడం, పైగా అది సామాన్య మానవుడికి అందుబాటు ధరలలో లభించడం 'టీ'కి మరింత ప్రాధాన్యత పెరగడానికి దోహదపడింది.



ప్రతి దేశంలోనూ టీ వినియోగంలో ఉన్నా భారతదేశం ఉత్పాదించే టీ వైవిధ్యానికీ, విశిష్టతకూ ప్రసిద్ధి పొందింది. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ టీ మిక్కిలి నాణ్యమైంది. ఇది సువాసనభరితమైనది. నాలుగో శతాబ్దంలో ఒక చైనా వైద్యుడు ఆకులను తుంచి, ఎండబెట్టి, ఒక ప్రత్యేక ఉష్ణోగ్రతలో వేడి చేసి, వేడి నీటిలో నానబెట్టగా వచ్చిన చేదు డికాక్షను వైద్య పరీక్షకు తాగాడు. ఈ టీ డికాక్షన్ తాగినందువల్ల అతను ఉత్తేజం పొందాడు. టీ సేవన ద్వారా మొట్టమొదటగా ఉత్సాహాన్నీ, ఆనందాన్నీ పొందిన వ్యక్తి ఆయనే కావడం విశేషం. 15వ శతాబ్దంలో నాగరిక ప్రపంచంలో టీ తాగడం ప్రారంభమైంది. 17వ శతాబ్దంలో ఈస్ట్ ఇండియా కంపెనీ వినిమయ పద్ధతిలో బట్టలు, వెండికి అనధికారికంగా నల్లమందుకు బదులుగా టీని చైనా నుండి దిగుమతి చేసుకునేది.

చాలా కాలం తర్వాత 1823లో బ్రిటన్‌కు చెందిన బ్రూస్ సోదరులు అస్సాంలో దేశీయంగా తేయాకును కనిపెట్టినప్పుడు భారతదేశంలో టీ ఉత్పాదన ప్రారంభమైంది. విస్తారంగా టీ వృద్ధి చెందే ప్రాంతాలను వీరు కనుగొన్నారు. చైనాతో 1833లో ఈస్టిండియా కంపెనీ గుత్తాధిపత్య వ్యాపార సంబంధాలు చెడిపోయినప్పుడు, ఇంగ్లాండు భారతదేశంలో 'టీ' ఉత్పాదనకు తీవ్ర ప్రయత్నాలు ప్రారంభించింది. 1860 నాటికి భారతదేశంలో టీ ప్లాంటేషన్ తోటలు బాగా అభివృద్ధి చెందినప్పుడు ఇక్కడే టీ ఉత్పాదన సుమారు పది లక్షల కేజీలు ఉండేది.

చైనా నుండి బ్లాక్, గ్రీన్ టీ రకాల విత్తనాలను లార్డ్ మెకార్డెనీ తెప్పించి, భారతదేశంలో 1793లో కలకత్తా బొటానికల్ గార్డెన్స్‌లో ప్రవేశపెట్టాడు. ఇవి పశ్చిమ బెంగాల్, కచార్, నీలగిరి ప్రదేశాలలో నాటి పెంచసాగారు. నేడు భారతదేశంలో సగానికి సగం టీ మొక్కలు ఆ తోటల పెంపకానికి చెందినవే. భారతదేశం, బ్రిటన్‌లో పాలు, పంచదార కలిపి తాగుతారు. టిబెటన్లు గ్రీన్ టీని ఉప్పు, యాక్ వెన్నతో కొయ్య కప్పులలో తాగుతారు. ఆఫ్రికాలో డికాక్షన్‌ను చిలికి నురగగా తయారు చేసి తాగుతారు. పశ్చిమ ఆసియాలో టీని యాలకులతో కలిపిన డికాక్షన్‌తో తాగితే, భారతదేశంలో గుజరాతీలు మసాలా టీ తాగుతారు. బ్లాక్/ గ్రీన్ టీని ఏలకులు, కొట్టిన బాదంపప్పు కలిపి కహ్వా అని కాశ్మీరీలు తాగుతారు. ఇది చాల పుష్టికరమైన, రుచికరమైన పానీయం. టీలో తెల్ల తేనీరు, నల్ల తేనీరు, గ్రీన్ లేదా ఆకుపచ్చ తేనీరు, డార్జిలింగ్ టీ, అల్లం టీ ఇలా కొన్ని రకాలున్నాయి. వీటిలో ఒకటైన అల్లం టీని తాగి ప్రయాణాలు చేస్తే వాంతులు రాకుండా ఉంటాయి. కొందరికి కార్లు, బస్సుల్లో ప్రయాణాలు చేసేటప్పుడు వాంతులు అవుతుంటాయి. అలాంటి వారు ప్రయాణానికి ముందు అల్లం టీ తాగితే ఫలితం ఉంటుంది.

తిన్న ఆహారం సరిగ్గా జీర్ణం కాకుండా సమస్యలు ఎదుర్కొనేవారు అల్లం టీని తాగితే ఆ సమస్య నుంచి బయట పడవచ్చు. కీళ్ల నొప్పులు ఉన్నవారు అల్లం టీ తాగితే ఆ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అల్లం టీని రోజూ తాగితే రక్త సరఫరా మెరుగు పడుతుంది. హైబీపీ తగ్గుతుంది. రుతుక్రమం సరిగ్గా ఉండని మహిళలు అల్లం టీ తాగితే ఉత్తమం. అలాగే శరీర రోగ నిరోధ శక్తి కూడా అల్లం టీతో పెరుగుతుంది.

బాగా తలనొప్పిగా ఉంటే అల్లం టీ తాగితే వెంటనే తలనొప్పి తగ్గిపోతుంది. అల్లం టీని నిత్యం తాగుతుంటే అధిక బరువు, కొలెస్ట్రాల్ సమస్యల నుంచి బయట పడవచ్చు. గుండె జబ్బులు రాకుండా ఉంటాయి.

– యామిజాల జగదీశ్

# ఇనకుల తిలకుడి వైభవం

**భారతీయులకు శ్రీరామచంద్రమూర్తి భగవంతుని రూపమే కాదు సకల గుణాభిరాముడు. ఆయన మార్గం అనుసరణీయం అని భావిస్తారు. ఈ కారణంగానే మన దేశంలో ప్రతి గ్రామంలోనూ ఒక రామాలయం లేదా ఒక రామ భజన మందిరం కనిపిస్తాయి. ముఖ్యంగా తెలుగువారికి ఆరాధ్య దైవం శ్రీ భద్రాద్రి రామచంద్ర స్వామి కంచర్ల గోపన్నని భక్త రామదాసుగా మార్చిన పవిత్ర స్థలం భద్రాచలం.**

పావన జీవనది గోదావరీ తీరంలో భక్తుడు భద్రుడు కోరిన కోరిక మేరకు ప్రత్యేకమైన భంగిమలో వైకుంఠ వాసుడు సీతా లక్ష్మణ సమేతులై శ్రీరాముడు శంఖు చక్రాలతో కొలువు తీరిన పవిత్ర ప్రదేశం భద్రాచలం. తెలుగువారంతా కలిసిమెలిసి శ్రీరామ నవమి ఉత్సవాలను, లోకాభిరాముని కల్యాణాన్ని రంగరంగ వైభవంగా జరుపుకోవడం కొన్ని శతాబ్దాల సంప్రదాయం. కల్యాణరాముని శోభను ప్రస్ఫుటంగా చూపించేది భద్రాచల దివ్యధామం. అందువలనే ఆంధ్ర ప్రాంతంలో ముఖ్యంగా కృష్ణాతీరంలో అనేక గ్రామాలలో శ్రీ భద్రాద్రి రాముని ఆలయాలు కనిపిస్తాయి.

ఇలపావులూరు గ్రామంలో కూడా కొన్ని శతాబ్దాల క్రితం నిర్మించిన శ్రీ హనుమత్ సమేత శ్రీ సీతా లక్ష్మణ సమేత శ్రీరాముని ఆలయం నిర్మించబడినట్లుగా తెలుస్తోంది.

## ఆలయ చరిత్ర

నేటి ప్రకాశం జిల్లాను గతంలో ఎన్నో రాజ వంశాల వారు పాలించారు. ముఖ్యంగా చాళుక్యుల నుండి చోళులు, పాండ్యులు, పల్లవులు, రెడ్డి రాజులు, విజయనగర రాజులు ఇలా ఎందరో ఈ ప్రాంత అభివృద్ధికి విశేష కృషి చేసినట్లుగా వివిధ కాలాలకు చెందిన శాసనాలు తెలుపుతున్నాయి.

ఇలపావులూరులోని ఆలయాన్ని ఇదుమిద్దంగా ఒక కాలానికి పరిమితం చేయలేని పరిస్థితి. కారణం ప్రత్యేక ప్రమాణాలు లేకపోవడమే. అందుబాటులో ఉన్న స్థానిక గాథల ఆధారంగా శ్రీరామచంద్రుడు సపరివారంగా ఈ ప్రాంతంలో పర్యటించినట్లుగా తెలియవస్తోంది.



చీమకుర్తి సమీపంలోని శ్రీ మోక్ష రామలింగేశ్వరస్వామిని శ్రీ రామచంద్రుడు రావణుని సంహరించడం వలన సంక్రమించిన బ్రహ్మహత్యా పాతకాన్ని తొలగించుకోడానికి ప్రతిష్ఠించినట్లు స్థల పురాణం చెబుతోంది.

విజయనగర చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు కూడా ఈ ప్రాంతంలోని అనేక ఆలయాలను సందర్శించి కైంకర్యాలు సమర్పించుకొన్నట్లుగా శాసన ఆధారాలు ఉన్నాయి. కాకపోతే తొలి ఆలయాన్ని చాళుక్యుల కాలంలో నిర్మాణం చేసినట్లుగా భావించవచ్చు. చాళుక్యుల కాలంలోనే ఆలయాలు లేని గ్రామాలలో వినాయక, శివ, విష్ణు, దేవీ ఆలయాలను నిర్మించడం జరిగింది. అనంతరం చోళులు, పాండ్యులు, విజయనగర, రెడ్డి రాజులు ఈ మండలంలోని ఆలయాలను పునః నిర్మించడంతో పాటు, మరికొన్ని నూతన ఆలయాలను కూడా నిర్మించినట్లు తెలుస్తోంది. ముఖ్యంగా చీమకుర్తి ప్రాంతాలలోని అనేక ఆలయాలు రేచెర్ల నాయక వంశానికి చెందిన కవి, పండితుడు, ప్రజల మంచికోరే రాజా సర్వజ్ఞ సింగభూపాలుని కాలంలో తిరిగి నిర్మించడం జరిగినట్లు చెబుతారు. సింగభూపాలుడు ఎన్నో కావ్యాలను రచించాడు. కవి పండితులను ఆదరించినట్లు తెలుస్తోంది. వీరి తొలి రాజధాని తెలంగాణలోని రేచర్ల.

రేచర్ల నాయకులు కొండవీటి రెడ్డి రాజులతో కలిసి కాకతీయ ప్రభువుల వద్ద సేనానాయకులుగా ఉన్నట్లు తెలుస్తోంది. కొన్ని కారణాల వలన సర్వజ్ఞ సింగ భూపాలుడు కొంత కాలం నేటి కర్నూల్, ప్రకాశం ప్రాంతాలకు తరలి వచ్చినట్లుగా తెలుస్తోంది.

వీరి కొలువును రాచకార్య నిమిత్తం రెడ్డిరాజుల ప్రతినిధిగా శ్రీనాథ కవిసార్వభౌముడు సందర్శించినట్లుగా తెలుస్తోంది. అమరావతి పాలకుడు రాజా వాసిరెడ్డి వేంకటాద్రినాయుడు కూడా ఆలయాభివృద్ధికి నిధులు ఇచ్చినట్లుగా చెబుతారు.

ఆధ్యాత్మిక శాంతికోసం వాసిరెడ్డి వేంకటాద్రి నాయుడు దేశంలోని ప్రముఖ ఆలయాలకు నిధులు ఇవ్వడమే కాకుండా కృష్ణ తీరంలో ఎన్నో ఆలయాలకు పునర్వైభవాన్ని తెచ్చారు. చివరగా పందొమ్మిదవ

శతాబ్ద కాలంలో ఈ ప్రాంతం వెంకటగిరి రాజుల పాలనలో ఉన్నది. అప్పుడు వేంకటగిరి మహారాజా వారు ఇలపావులూరు ఆలయ నిర్వహణ నిమిత్తం, అర్చకుల జీవనానికి, ఇతర ఆలయ సిబ్బంది నిత్య జీవనం సాఫీగా సాగడానికి భూములు ఇచ్చినట్లుగా తెలుస్తోంది. కాలక్రమంలో వారిలో చాలా కుటుంబాలవారు గ్రామం విడిచి వెళ్లిపోయారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆర్థిక సహకారంతో ఆలయ నిర్వహణ జరుగుతున్నట్లుగా తెలుస్తోంది.

### ఆలయ విశేషాలు

తూర్పు ముఖంగా ఉండే ఈ ఆలయానికి ఎలాంటి రాజగోపురం కానీ విశేష నిర్మాణాలు కానీ కనపడవు. ప్రాంగణంలో ప్రధాన ఆలయం కాకుండా శ్రీ ఆంజనేయస్వామి వారి సన్నిధి ఉంటుంది. పక్కనే ఎత్తైన ధ్వజస్థంభం గర్వంగా ఆలయ ఉనికిని తెలియచేస్తుంది. శ్రీ ఆంజనేయస్వామి వారి ఉపాలయం, గర్భాలయానికి అనుసంధానంగా ఉన్న ముఖ మండపాన్ని స్థానికుల సహకారంతో నిర్మించినట్లుగా శిలాఫలకం వల్ల తెలుస్తోంది. గర్భాలయం పైన ఉన్న విమాన గోపురం మీద సుందర దశావతార రూపాలు, శ్రీరామాయణ ముఖ్యఘట్టాల శిల్పాలు ఉండేవని చెబుతారు.

### పూజలు, ఉత్సవాలు

ఈ ఆలయంలో నిత్య పూజలు జరుగుతున్నాయి. పర్వదినాలలో వచ్చే భక్తుల కోసం ఉగాది, శ్రీరామనవమి, శ్రీకృష్ణ జన్మాష్టమి, ధనుర్మాస పూజలు, హనుమజ్జయంతి జరుపుతున్నారు. దాతల సహకారంతో గ్రామస్థులు, ఆలయ నిర్వాహకులు ఇలపావులూరు గ్రామంలోని శివ, రామాలయాలను పునఃనిర్మించి అభివృద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

చుట్టుపక్కల ఉన్న చీమకుర్తి, సంతనూతలపాడు, మల్లవరం, చదలవాడ, జిల్లా ప్రధాన నగరం ఒంగోలులో కూడా ఎన్నో పురాతన పౌరాణిక చారిత్రక ప్రాధాన్యం కలిగిన దేవాలయాలు చాలా ఉన్నాయి.

**- ఇలపావులూరి వేంకటేశ్వర్లు**

---

# హనుమంతుడు లేని రామాలయం



ఈ ఆలయం శంషాబాద్‌కు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది. హనుమంతుడు లేని సీతారామచంద్ర స్వామి ఆలయాలు చాలా చాలా అరుదు అని చెప్పవచ్చు.

ఈ ఆలయం 'అమ్మపల్లి రామాలయం'గా ప్రసిద్ధి గాంచింది. ఈ దేవాలయం భక్తులను, పర్యాటకులను విశేషంగా ఆకర్షించడానికి ప్రధాన కారణం ఇక్కడి వాతావరణం.

ఎంతసేపైనా ఈ ప్రదేశంలో వుండిపోవాలని అనిపిస్తుంది. ఈ దేవాలయ పరిసరాలలో తెలుగు సినిమా షూటింగ్‌లు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇక్కడ సినిమా షూటింగ్ జరిగితే, ఆ సినిమా తప్పనిసరిగా విజయవంతం అవుతుందని ప్రగాఢమైన నమ్మకం.

### చారిత్రక కథ

సీతారామచంద్ర స్వామి ఆలయాన్ని 13వ శతాబ్దంలో వేంగీ రాజులు నిర్మించారు. ఈ దేవాలయ గుడిలోని విగ్రహం వెయ్యి సంవత్సరాల నాటిది. అయితే, ప్రతి రామాలయంలో సీతా రామ లక్ష్మణ సమేతంగా కింద కూర్చుని వున్న హనుమంతుడి విగ్రహం ఉంటుంది. కానీ ఈ దేవాలయంలో హనుమంతుడి భంగిమ ఉండదు. అయితే, ద్వజస్థంభం వద్ద ఆంజనేయుని ప్రతిమను చూడవచ్చు.

హనుమంతుడిని కలవడానికి ముందే సీతా రామ లక్ష్మణులు ఈ ప్రదేశానికి వచ్చారనీ, శ్రీరామచంద్రుల వారి అజ్ఞాతవాసం ముగిసేవరకు ఈ ముగ్గురి వద్ద హనుమంతుడు కూర్చోకపోవడం వల్లనే ఆంజనేయుడు ఈ దేవాలయంలో లేదని అంటారు.

250 ఎకరాల విస్తీర్ణంలో వున్న ఈ ఆలయ పరిసరాలు ప్రశాంతంగా ఉంటాయి. 2010 సంవత్సరంలో యునెస్కో వారసత్వ సంపదగా ఈ ఆలయం గుర్తించబడింది. ఈ ఆలయం గురించి వివరించే ఇతర ఎటువంటి శాసనాలు ఇక్కడ లేవు. ప్రతి సంవత్సరం శ్రీరామనవమి ఉత్సవాలు ఈ రామాలయంలో అతి వైభవోపేతంగా జరుగుతాయి.

# 8 ఫిబ్రవరి, 2026 నుండి 14 ఫిబ్రవరి, 2026 వరకు



## వారఫలం


శ్రీమతి ములుగు శివజ్యోతి, ప్రముఖ జ్యోతిష్యురాలు

నారాయణ నాయక్ కాంప్లెక్స్, 2వ అంతస్తు, గాంధీ జ్ఞానమందిర్ వెనుక, కోఠి, హైదరాబాద్-1

ఫోన్ : 98494 53449, 9440927795


### మేషం

ఈ వారం ఆరోగ్య సమస్యలు తీరతాయి. పట్టుదలతో కొన్ని వ్యవహారాలలో విజయం సాధిస్తారు. ఒక సమాచారం విశేషంగా ఆకట్టుకుంటుంది. చిన్ననాటి మిత్రుల నుండి ఆర్థిక సహాయం గృహోపకరణాలను కొనుగోలు చేస్తారు. కుటుంబ పురోగతి బాగుంటుంది. వృత్తి, వ్యాపారాలలో కొన్ని నూతన మార్పులు చేసి తద్వారా లాభపడతారు. వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు నిత్యం నాగసింధూరం ధరించడం చెప్పదగినది.

### వృషభం

ఈ వారం చేపట్టిన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. ఇంటా, బయటా అనుకూలంగా ఉంటుంది. ఆస్తి వివాదాలు తీరి లబ్దిపొందుతారు. ఆప్తుల నుండి కీలక విషయాలు తెలుసుకుంటారు. వృత్తి, వ్యాపారాలు లాభిస్తాయి. ఉద్యోగులకు హోదాలు దక్కుతాయి. రాజకీయ కళారంగాల వారికి సన్మానాలు. ధన, వస్తు,లాభాలు పొందుతారు. చర్చల్లో పురోగతి. ఆరోగ్యం పట్ల మెలకువ అవసరం.

### మిథునం

ఈ వారంవిలువైన వస్తువులు, వస్త్రాలు ఆభరణాలు కొనుగోలు చేస్తారు. పరిశోధనలు, సాంకేతిక రంగాలపైన ఆసక్తి చూపుతారు. నూతన వ్యక్తులతో పరిచయమై సహాయం అందిస్తారు. స్థిరాస్తి వివాదాలు తీరి నూతన ఒప్పందాలు చేసుకుంటారు. అనుకున్న విధంగా పనులు సకాలంలో పూర్తి చేస్తారు. హోదాలు లభిస్తాయి. ఇంక్రిమెంట్లు రాగలవు. విదేశీ పర్యటనల సూచన. క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు.

### కర్కాటకం

ఈ వారం స్పెక్యులేషన్ జోలికి పోకుండా ఉండవలసిన వారం. పనులు నిదానంగా పూర్తవు తాయి. వృత్తి ఉద్యోగాలలో, వ్యాపారంలో మీకు సమాన స్థాయి పోటీగా కొన్ని సంఘటనలు, వ్యక్తులు ఎదురు కావచ్చు. డబ్బు, లేదా విలువైన వస్తువుల రవాణాలో మెళకువతో సంచరించండి. సర్వ రక్షా చూర్ణంతో స్నానం చేయడం వలన మేలు కలుగుతుంది.

### సింహం

ఈ వారం ఆర్థిక వ్యవహారాలు అనుకూలంగా ఉంటాయి. దూర ప్రాంత ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. సంఘంలో గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. ప్రేమ విషయములో నిదానం అవసరం. ఋణాలు చాలా వరకు తీరుస్తారు. దూర ప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుతాయి. నూతన ప్రయ త్నాలు అనుకూలిస్తాయి. భూవివాదాలు కోర్టు,కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. గృహ నిర్మాణ ఆలోచనలు కలిసి వస్తాయి.

### కన్య

ఈ వారం మిత్రుల నుండి సహాయం పొందుతారు. నూతన ఉద్యోగావకాశాలు లభిస్తాయి. సభలు సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు. వృత్తి, వ్యాపారాలలో ఎదురైన ఆటంకాలు సమర్ధవంతంగా ఎదుర్కొంటారు. అహంభావ ధోరణిని విడనాడి సహోద్యోగులతో స్నేహభావంతో మెలగడంమంచిది పన్నులను సకాలంలో చెల్లిస్తారు. వివాహాది శుభకార్యాలలో పాల్గొంటారు సమయానికి నిద్రాహారాలు ఉండవు.

### తుల

ఈ వారం ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. దీర్ఘకాలిక సమస్యలు తీరతాయి. ముఖ్యమైన కార్యక్రమాలు సాఫీగా సాగుతాయి. బంధువుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. ఉద్యోగులకు హోదాలు దక్కుతాయి. రాజకీయ కళారంగాల వారికి ప్రభుత్వపరంగా ఆహ్వానాలు అందుతాయి. షేర్లు, భూముల క్రయవిక్రయాలలో లాభాలు పొందుతారు. నూతన ప్రయత్నాలలో పురోగతి ఉంటుంది.

### వృశ్చికం

ఈ వారం ఋణాలు ఇవ్వడం, ఋణాలు తీసుకోవడం రెండూ కలిసి రాలవు. ఆరోగ్యపరంగా స్వల్పమైన చికాకులు అంతోఇంతో ఇబ్బంది పెడతాయి. బ్యాంక్ లోన్లు మంజూరవుతాయి. మితంగా మాట్లాడటం మంచిది. దేశభక్తి రాజకీయాలు వంటి అంశాలపైన దృష్టి మారుతుంది. మిత్రవర్గంలోనికి కొత్త వారికి చోటు కల్పిస్తారు. స్పెక్యులేషన్కు దూరంగా ఉండటం చెప్పదగినది.

### ధనస్సు

ఈ వారం దైనందిన జీవితంలో మార్పులను చేస్తారు. కళాసాంస్కృతిక సాంప్రదాయ కార్యక్రమాలలో పాల్గొంటారు. స్త్రీలతో మాట్లాడేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించండి. చెల్లించవలసినవి, రావలసినవి మొదలయిన ఆర్థిక అంశాలపైన దృష్టిని సారిస్తారు. లీజులు, లైసెన్సులు పొడిగించబడతాయి. ప్రయాణాలలో నున్న పెద్దల మాట మరువవద్దు. నిత్యం ఆరావళి కుంకుమతో మహాలక్ష్మీదేవిని పూజించండి.

### మకరం

ఈ వారం ప్రయాణ సమయాలలో వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్త వహించండి. వృత్తి, వ్యాపార, కార్యాలయాలలో స్వల్పమైన ఒడిదుడుకులు చోటుచేసుకున్నా సర్దుబాటు చేసుకొనే విధంగా ఉంటాయి. కట్టుదిట్టమైన ప్రణాళికలు ఉన్నప్పటికీ సాంకేతిక లోపాలు చోటు చేసుకుంటాయి. అవసరాలకు తగినంత ధనమును కలిగి ఉంటారు. కలిసి ఉంటే కలదు సుఖం అని భావిస్తారు. అందరిని కలుపుకుంటారు.


### కుంభం


ఈ వారం ఆర్థిక ఇబ్బందుల నుండి బయటపడతారు. ఋణాలు కొంతవరకు తీరుస్తారు. కుటుంబ పరంగా సమస్యలు ఎదురైనా అధిగమిస్తారు. వివాదాలకు దూరంగా వుండడం మంచిది. అష్టమూలికా గుగ్గిలంతో గృహంలో నిత్యం ధూపం వేయండి. సోదరుల నుండి కీలక సమాచారం అందుకుంటారు. ప్రయాణాలు చేయవలసి వస్తుంది. గృహ ప్రవేశాది శుభకార్యాలలో పాల్గొంటారు. వారాంతంలో కొన్ని అనుకూలమైన మార్పులు గోచరిస్తున్నాయి.


### మీనం

ఈ వారం చాకచక్యంగా వ్యవహరించి పనులు పూర్తి చేస్తారు. ఎంతటి పనినైనా పట్టుదలతో పూర్తి చేస్తారు. శత్రువులు సైతం మిత్రులుగా మారి సహాయం అందిస్తారు. సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. మీ ప్రతిభకు గుర్తింపు లభిస్తుంది. వృత్తి, వ్యాపారాలలో లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు ఇంక్రిమెంట్లు రాగలవు. రాజకీయ, కళా, సాహిత్య రంగాల వారికి యోగదాయకంగా ఉంటుంది. ఆకస్మిక ధనలాభం పొందుతారు.

# ఈ వారం కార్టూన్స్


ఫుడ్డు ఆర్డర్ పెట్టావా? ఆర్డర్ పెట్టడం నేర్చుకో..!
రేపొద్దున ఇదేం పెంపకం అని నన్నంటారు!!


ఉడికే దాకా కూడ ఆగలేరా?
ఒక్కడికి నేనేదో పెట్టనట్లు!?


యూట్యూబ్ చూస్తేదా?
నవ్వుతూ ప్రేమగా గోకాలంట!!


















ఫోటోలు చూస్తుంటే సరస్సు హోలీ పండుగ చేసుకుందా? అన్నట్లు అనిపిస్తుంది కదా! సెనెగల్‌లోని ఈ సరస్సును రెట్బా సరస్సు అంటారు. ఇందులో ఉండే ఒక రకమైన జలచరాల వల్ల నీళ్లు రంగు మారింది.